



(PRGI NO: APTEL / 2023 / 88653)

# పబ్లిక్ వ్యూ

తెలుగు దిన పత్రిక PUBLIC VIEW TELUGU DAILY

సంపుటి : 2 సంచిక : 181 పేజీలు :8 సంపాదకులు : చిరికి లోకేశ్వరరావు ప్రచురణ : అనకాపల్లి శుక్రవారం 20 మార్చి 2026 వెల : 5/-రూ॥

VOLUME :2 ISSUE :181 PAGES :8 EDITOR : CHIRIKI LOKESWARA RAO PUBLISHED FROM :ANAKAPALLI FRI 20 MARCH 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Circulated by Srikakulam,Vizianagaram, Kakinada,Eluru,Vijayawada,Guntur, Ongole, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

## జ్యోతిష్యుడి ముసుగులో కామ పిశాచి... 58 మంది మహిళలపై అఘాయిత్యం!



- ప్రముఖ జ్యోతిష్యుడు 'కెప్టెన్' అశోక్ ఖారట్ అరెస్ట్
- జ్యోతిష్యం పేరుతో మహిళలకు మత్తుమందు ఇచ్చి లైంగిక దాడి
- పెన్‌డ్రైవ్‌లో 58 మంది మహిళల అత్యాచార వీడియోలు స్వాధీనం
- కేసు దర్యాప్తునకు ఐపీఎస్ అధికారిణి నేతృత్వంలో సిట్ ఏర్పాటు
- రాజకీయ, సినీ ప్రముఖులతో ఖారట్‌కు సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు

పబ్లిక్ వ్యూ డెస్క్:మహారాష్ట్రలోని నాసిక్‌లో ఓ కీచక జ్యోతిష్యుడి గుట్టురట్టయింది. జ్యోతిష్యం, వాస్తు పేరుతో మహిళలను లోబర్చుకుని, లైంగికంగా దోపిడీ చేస్తున్న ప్రముఖ జ్యోతిష్యుడు, రిటైర్డ్ మర్చంట్ నేవీ అధికారి అశోక్ ఖారట్ (67) అలియాస్ 'కెప్టెన్'ను పోలీసులు అరెస్టు చేశారు. ఇతని కార్యాలయంలో 58 మంది మహిళలపై లైంగిక దాడికి పాల్పడిన వీడియోలతో కూడిన పెన్‌డ్రైవ్

- మిగతా2లో

## వైఎస్ బతికున్నప్పుడే షర్మిలకు భారీగా ఆస్తులు ఇచ్చారు..

# షర్మిల ఖర్చులన్నీ చంద్రబాబువే



- జగన్ కంటే షర్మిలకే వైఎస్సార్ ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారన్న సతీశ్ రెడ్డి
- జగన్ సంపాదించుకున్న ఆస్తుల్లో కూడా వాటా అడగడం ధర్మం కాదని వ్యాఖ్య
- చంద్రబాబు చేతిలో షర్మిల, సునీత పావులు అని విమర్శ

పబ్లిక్ వ్యూ డెస్క్:వైఎస్ కుటుంబం చుట్టూ తిరుగుతున్న రాజకీయ వివాదాలపై వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీశ్ రెడ్డి నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆడిస్తున్న నాటకంలో షర్మిల, సునీత కేవలం పావులని అన్నారు. తాడేపల్లిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

- మిగతా2లో

# యుద్ధాన్ని ముగిస్తాం..


## ఎప్పుడు అనేది అంతిమ నిర్ణయం ట్రంప్‌దే

- యుద్ధం ఎప్పుడు ముగుస్తుందనే అంశంపై స్పందించేందుకు నిరాకరణ
- అమెరికా ప్రణాళిక ప్రకారమే వెళుతోందన్న రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్
- ఏ లక్ష్యాలతో యుద్ధం ప్రారంభించామో వాటిని సాధించి మిషన్ పూర్తి చేస్తామని వెల్లడి

పబ్లిక్ వ్యూ డెస్క్::ఇరాన్‌పై యుద్ధంలో అమెరికా ప్రణాళిక ప్రకారమే ముందుకు సాగుతోందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ అన్నారు. అయితే ఈ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందనే విషయం చెప్పలేమని అన్నారు. యుద్ధం ముగింపుపై కచ్చితమైన కాలపరిమితిని చెప్పేందుకు ఆయన

- మిగతా2లో





## తెలంగాణ అసెంబ్లీ, మండలిలో ప్రభుత్వ విప్‌ల నియామకం

- అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్‌లను విప్‌లుగా నియమించిన ప్రభుత్వం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి
- అసెంబ్లీ విప్‌లుగా ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వేముల వీరేశం, విజయరమణారావు

:తెలంగాణ శాసనమండలిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్‌లను రాష్ట్ర ప్రభుత్వం విప్‌లుగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని తెలిపారు.ఇక, అసెంబ్లీ విప్‌లుగా ముగ్గురు ఎమ్మెల్యేలను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

- మిగతా2లో



## ఉగాది నాడు మా కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది

- 10,060 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల
- గ్రూప్ 1, గ్రూప్ 2 సహా పలు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు
- నిర్దేశిత సమయంలోనే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తామని పవన్ హామీ
- గత 20 నెలల్లో 30,607 ఉద్యోగాలు ఇచ్చామని వెల్లడి

ఉగాది పర్వదినాన తమ కూటమి ప్రభుత్వం రాష్ట్ర యువతకు తీపి కబురు చెప్పిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. రాష్ట్రంలో 10,060 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసినట్లు ఆయన ప్రకటించారు. నిర్దేశిత సమయంలోనే

- మిగతా2లో

# ఏపీలో అకాల వర్షాలతో భారీగా పంట నష్టం...

# అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష

- రాష్ట్రంలో అకాల వర్షాలతో భారీగా పంట నష్టం
- 1,215 హెక్టార్లలో వ్యవసాయ, 267 హెక్టార్లలో ఉద్యాన పంటలు ధ్వంసం
- పంట నష్టంపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష
- పూర్తిస్థాయిలో వివరాలు సేకరించాలని అధికారులకు ఆదేశాలు




పబ్లిక్ వ్యూ డెస్క్::రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలు, వడగళ్ల వానలు రైతులను తీవ్రంగా దెబ్బతీశాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 1,215 హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 267 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయ శాఖ అధికారులతో అమరావతిలో సమీక్ష నిర్వహించారు.

కృష్ణా, నెల్లూరు, శ్రీ సత్యసాయి, ఎన్టీఆర్, అనంతపురం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 16 మండలాల పరిధిలోని 89 గ్రామాల్లో వర్షాల ప్రభావం ఎక్కువగా ఉందని అధికారులు సీఎంకు వివరించారు. మొత్తం 2,043 మంది రైతులకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. దెబ్బతిన్న పంటల్లో ప్రధానంగా 630 హెక్టార్లలో మొక్కజొన్న, 384 హెక్టార్లలో వరి, 200 హెక్టార్లలో మినుము ఉన్నాయని ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు.

వ్యవసాయ పంటలతో పాటు ఉద్యాన పంటలపైనా వర్షాలు తీవ్ర ప్రభావం చూపాయని అధికారులు తెలిపారు. ముఖ్యంగా అనంతపురం, శ్రీసత్యసాయి, ఎన్టీఆర్ జిల్లాల్లో 267 హెక్టార్లలో అరటి, బొప్పాయి, మామిడి, ఆరెంజ్ వంటి పంటలు దెబ్బతిన్నాయని, దీనివల్ల 307 మంది ఉద్యాన రైతులు నష్టపోయారని ముఖ్యమంత్రికి వివరించారు.

ఈ ప్రాథమిక అంచనాలపై స్పందించిన ముఖ్యమంత్రి, క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పంట నష్టాన్ని లెక్కించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, వాతావరణ మార్పులపై రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించి వారిని అప్రమత్తం చేయాలని సూచించారు. తద్వారా భవిష్యత్తులో నష్టాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

- మిగతా2లో




## ఇరాన్ యుద్ధం దేశానికే కాదు ప్రపంచానికి పరీక్ష సమయం

- ఇంధన అవసరాల తీరేలా సంబంధిత దేశాలతో మాట్లాడుతున్నట్లు వెల్లడి
- పశ్చిమాసియాలో పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామన్న రణధీర్ జైశ్వాల్
- కువైట్ యువరాజుతో ప్రధాని మోదీ మాట్లాడారన్న జైశ్వాల్

ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా పశ్చిమాసియా పరిణామాలు మన దేశానికే కాకుండా ప్రపంచానికే పరీక్షగా మారాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. దేశ ఇంధన అవసరాలు తీరేలా చూసుకోవడానికి సంబంధిత దేశాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు

- మిగతా2లో

# సంస్కృతికి సాంకేతికత జోడించి అభివృద్ధి..




## పరాభవ నామ సంవత్సరంలో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

- ఏపీ ప్రభుత్వం ఉగాది వేడుకలు
- హాజరైన సీఎం చంద్రబాబు
- ప్రతి ఏటా ఉగాదికి జాబ్ క్యాలెండర్ ఇస్తామని హామీ
- 2047 నాటికి తెలుగు జాతిని ప్రపంచంలోనే నంబర్ వన్‌గా నిలపాలన్నదే లక్ష్యమని ప్రకటన
- జనాభా పెరుగుదల కోసం ప్రోత్సాహకాలు.. ఇద్దరు, ముగ్గురు పిల్లలుంటే ఆర్థిక సాయం

పబ్లిక్ వ్యూ డెస్క్:పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా వేడుకలను ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలుగు ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరం అందరికీ శుభాలను, విజయాలను అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2047 నాటికి తెలుగు జాతిని ప్రపంచంలోనే నంబర్ వన్ కమ్యూనిటీగా నిలపాలన్నదే తన సంకల్పమని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే లక్ష్యాలుగా ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.

- మిగతా2లో



# వైఎస్ బతికున్నప్పుడే షర్మిలకు భారీగా ఆస్తులు ఇచ్చారు..

# షర్మిల ఖర్చులన్నీ చంద్రబాబువే

వైఎస్ కుటుంబ ఆస్తుల తగాదాపై వస్తున్న ఆరోపణలను సతీశ్ రెడ్డి తిప్పికొట్టారు. "వైఎస్ రాజశేఖర్ రెడ్డి బతికున్నప్పుడే షర్మిలకు భారీగా ఆస్తులు రాసిచ్చారు. జూబ్లీహిల్స్ ఇల్లు, ఇడుపులపాయ భూములు, హైడ్రో ప్రాజెక్టుల్లో వాటాలు.. ఇలా కొడుకు కంటే కూతురికే వైఎస్సార్ ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఇప్పుడు జగన్ తన స్వార్జితంతో సంపాదించుకున్న ఆస్తుల్లో కూడా వాటా కావాలని అడగటం ధర్మం కాదు" అని ఆయన స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో షర్మిల ఖర్చు చేసిన ప్రతి పైసా చంద్రబాబు ఇచ్చినదేనని ఆయన ఆరోపించారు. వివేకా హత్య జరిగే సమయానికే అవినాశ్ రెడ్డికి జగన్ ఎంపీ సీటు ఖరారు చేశారని, వివేకా కూడా ఆయన గెలుపు కోసమే పనిచేశారని గుర్తు చేశారు. సీటు కోసం హత్య చేశారనడం అవివేకమని కొట్టిపారేశారు. భూమి వివాదంలో ఎర్ర గంగిరెడ్డి, వివేకా మధ్య గొడవలు ఉన్నాయని స్వయంగా దస్తగిరి స్టేట్‌మెంట్ ఇచ్చాడని, కానీ సునీత మాత్రం ఉద్దేశపూర్వకంగా అవినాశ్ ను ఇరికించాలని చూస్తున్నారని విమర్శించారు. "అవినాశ్ ఇప్పటికీ సునీతక్క, వివేకం పెదనాన్న అని గౌరవంగా మాట్లాడుతుంటే.. సునీత మాత్రం వివేకా పేరును, ఇమేజ్‌ను చెడగొడుతోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టి ఎందుకు వదిలేశారో అందరికీ తెలుసని, ఏపీలో జగన్‌ను ఇబ్బంది పెట్టడానికే ఆమెను చంద్రబాబు ఇక్కడికి తెచ్చారని సతీశ్ రెడ్డి ఆరోపించారు. సునీత, షర్మిల, చంద్రబాబు, దస్తగిరి... వీరందరికీ కోర్టులో వాదించేది ఒక్కరే న్యాయవాది అని, దీనిని బట్టే వీరి వెనుక ఉన్న అసలు సూత్రధారి ఎవరో అర్థమవుతోందని స్పష్టం చేశారు.

## సంస్కృతికి సాంకేతికత జోడించి అభివృద్ధి..

- మొదటి పేజీ తరువాయి

**సంస్కృతి, సాంప్రదాయాలకు సైన్స్ జోడింపు**

ఉగాది పండుగ తెలుగువారి తొలి పండుగ అని, మన సంస్కృతి, సాంప్రదాయాల్లో సైన్స్ ఇమిడి ఉందని చంద్రబాబు వివరించారు. ఉగాది పచ్చడి జీవితంలోని కష్టసుఖాలకు ప్రతీక అని పేర్కొన్నారు. మన ఆచారాలైన వాస్తు, యోగా, ధ్యానం వెనుక శాస్త్రీయత దాగి ఉందని, ఆరోగ్యకరమైన జీవనశైలికి ఇవి దోహదపడతాయని అన్నారు. గతంలో తాను ఐటీ ప్రాముఖ్యతను గుర్తించి ప్రోత్సహించడం వల్లే నేడు తెలుగువారు ప్రపంచవ్యాప్తంగా ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి నూతన సాంకేతికతలను అందిపుచ్చుకుని భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. తాను కూడా సెల్ ఫోన్ ద్వారానే పాలన సాగిస్తూ, టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటున్నానని తెలిపారు.

**సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం**

2024కు ముందు రాష్ట్రంలో పండుగలు కూడా జరుపుకోలేని భయానక వాతావరణం ఉండేదని, అరాచకాలు, విధ్వంసంతో ప్రజలు విసిగిపోయారని చంద్రబాబు అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును కాపాడాలనే సంకల్పంతో జనసేన, బీజేపీతో కలిసి ఎన్డీయే కూటమిగా ఏర్పడి ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 21 నెలలుగా సమ్మిళిత సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం మందిని పైకి తీసుకురావడానికి, ఆర్థికంగా నిలదొక్కుకున్న 10 శాతం మంది చేయూతనివ్వాలని కోరుతూ 'మార్గదర్శి బంగారు కుటుంబం' అనే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు.

**ఉగాది కానుకగా ఉద్యోగాల జాతర**

యువత భవిష్యత్తుకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఉగాది పండుగ సందర్భంగా చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. ఇకపై ప్రతి ఏటా ఉగాది రోజున ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 10,060 ఉద్యోగాల భర్తీకి ప్రకటన చేశారు. ఇందులో గ్రూప్-1, గ్రూప్-2, హోంశాఖ, ఉన్నత విద్య, ఇంజనీరింగ్ వంటి పలు విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. మే 15 నుంచి అక్టోబర్ 15 మధ్య ఈ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చి నియామక ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే అధికారంలోకి వచ్చాక తొలి సంతకంతో మెగా డీఎస్సీ ద్వారా 15,941 టీచర్ పోస్టులు, 5,757 కానిస్టేబుల్ పోస్టులతో సహా మొత్తం 30,607 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, ప్రైవేటు రంగంలో 6.28 లక్షల ఉద్యోగాలు కల్పించామని గుర్తుచేశారు.

**పోలవరం, అమరావతిపై స్పష్టమైన హామీ**

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, అందులో భాగంగానే పోలవరం, అమరావతి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చంద్రబాబు పునరుద్ఘాటించారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు ప్రారంభమయ్యేలోగా పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని స్పష్టం చేశారు. దీనికి అవసరమైన నిధుల కోసం కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని, త్వరలోనే మిగిలిన నిధులను కూడా సమకూర్చుకుని పనులు వేగవంతం చేస్తామన్నారు. అమరావతి దేవతల రాజధాని మాత్రమే కాదని, అది ఐదు కోట్ల ప్రజల రాజధాని అని పేర్కొన్నారు. అమరావతిని అత్యున్నత స్థాయిలో అభివృద్ధి చేసి, సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలని వెంకటేశ్వర స్వామిని ప్రతిరోజూ ప్రార్థిస్తానని తెలిపారు.

**కుటుంబ వ్యవస్థ పరిరక్షణకు కొత్త విధానాలు**

మారుతున్న కాలంతో పాటు కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులపై చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా తగ్గుదల వల్ల భవిష్యత్తులో అనేక సమస్యలు తలెత్తుతాయని, అందుకే జనాభా నిర్వహణపై కొత్త పాలసీ తీసుకురానున్నట్లు తెలిపారు. "ఒకరు వద్దు, ఇద్దరు ముద్దు, ముగ్గురుంటే ఇంకా మంచిది" అనే నినాదంతో ముందుకెళ్తామన్నారు. ఇద్దరు, ముగ్గురు పిల్లలను కనే దంపతులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటించారు. 'తల్లికి వందనం' వంటి పథకాల ద్వారా ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఆర్థిక సహాయం అందించి కుటుంబాలను ప్రోత్సహిస్తామని చెప్పారు. పెద్ద కుటుంబాలు సుఖసంతోషాలకు నిలయాలని, విడిపోవడం కంటే కలిసి ఉండటానికే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు.

**2047 నాటికి తెలుగుజాతి నంబర్ వన్**

ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిస్థితులు మనపై ప్రభావం చూపుతాయని, ఇలాంటి సమయంలో మనం తప్పులు చేయకుండా జాగ్రత్తగా ముందుకు సాగాలని చంద్రబాబు హితవు పలికారు. పరాభవ నామ సంవత్సరం తెలుగుజాతి కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచానికి చాటిచెప్పే సంవత్సరంగా నిలవాలని ఆకాంక్షించారు. 2047 నాటికి భారతదేశ స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి తెలుగువారు ప్రపంచంలోనే నంబర్ వన్‌గా నిలవాలనే సంకల్పాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు. సంపదతో పాటు విలువలను కాపాడుకుంటూ, సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తుచేస్తూ, అందరికీ మరోసారి ఉగాది శుభాకాంక్షలు తెలిపి తన ప్రసంగాన్ని ముగించారు.

## ఉగాది నాడు మా కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది

- మొదటి పేజీ తరువాయి

ఈ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ సోషల్ మీడియాలో స్పందిస్తూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం యువత ఆకాంక్షలను మనసుతో అర్థం చేసుకుంటోందని తెలిపారు. ఈ ఏడాది విడుదల చేసే నోటిఫికేషన్ల ద్వారా గ్రూప్ 1, గ్రూప్ 2, ఇంజనీరింగ్, టీచింగ్, యూనిఫాం సర్వీసెస్ వంటి పలు విభాగాల్లో పోస్టులను భర్తీ చేయనున్నట్లు వివరించారు. గత 20 నెలల కాలంలో తమ ప్రభుత్వం 30,607 ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిందని

పవన్ గుర్తుచేశారు. ఇటీవల ఉపాధ్యాయ, కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందించినప్పుడు యువత కళ్లలో ఆనందం చూశామని తెలిపారు. తాజా ప్రకటన నేపథ్యంలో ఉద్యోగార్థులు ఏమాత్రం సమయం వృథా చేయకుండా ప్రిపరేషన్‌లో నిమగ్నం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## యుద్ధాన్ని ముగిస్తాం.. ఎప్పుడు అనేది అంతిమ నిర్ణయం ట్రంప్‌దే

- మొదటి పేజీ తరువాయి

నిరాకరించారు. యుద్ధం విషయంలో అంతిమ నిర్ణయం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌దే అన్నారు. యుద్ధం ముగింపునకు తాము కచ్చితమైన కాలపరిమితిని నిర్దేశించుకోలేదని తెలిపారు. సౌదీ అరేబియాలోని అతిపెద్ద గ్యాస్ కేంద్రంపై ఇరాన్ దాడికి పాల్పడడంతో ఆగ్రహించిన అమెరికా తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించింది. ఇరాన్‌పై ఈ రోజు భారీ స్థయిలో దాడులకు పాల్పడుతామని, గల్ఫ్ యుద్ధాన్ని తమదైన స్టయిల్లో ముగిస్తామని పీట్ హెగ్సెత్ హెచ్చరించారు. చనిపోయిన వారిని గౌరవిస్తామని, అనుకున్న పనిని పూర్తి చేస్తామని ఆయన వ్యాఖ్యానించారు. ఆ తర్వాత యుద్ధాన్ని ముగిస్తామని అభిప్రాయపడ్డారు. ఇరాన్‌పై యుద్ధానికి దిగిన మొదటి రోజు నుంచి తమ లక్ష్యంలో ఎలాంటి మార్పు లేదని ఆయన వెల్లడించారు. ఇరాన్ రక్షణ, క్షిపణి తయారీ కేంద్రాలను నాశనం చేశామని, కాబట్టి ఆ దేశం కొత్తగా బాలిస్టిక్ క్షిపణులను తయారు చేసుకోలేదని అన్నారు. అంతేకాదు ఇరాన్‌కు చెందిన 11 జలాంతర్గాములను ముంచివేసినట్లు తెలిపారు. ఏయే లక్ష్యాలతో ఇరాన్‌లో యుద్ధం ప్రారంభించామో అవన్నీ సాధించి, తాము అనుకున్న మిషన్‌ను పూర్తి చేస్తామని పీట్ హెగ్సెత్ అన్నారు.

## జ్యోతిష్యుడి ముసుగులో కామ పిశాచి... 58 మంది మహిళలపై అఘాయిత్యం!

- మొదటి పేజీ తరువాయి

లభించడం కేసు తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ కేసు దర్యాప్తు కోసం మహారాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. వివరాల్లోకి వెళితే, నాసిక్‌లోని కెనడా కార్నర్ ప్రాంతంలో అశోక్ ఖారట్ 'ఓకస్ ప్రాపర్టీ డీలర్స్ అండ్ డెవలపర్స్' పేరుతో కార్యాలయం నడిపేవాడు. తనను తాను 'కెప్టెన్' అని, ఆధ్యాత్మిక శక్తులు ఉన్నాయని ప్రచారం చేసుకునేవాడు. వివాహ సమస్యలతో బాధపడుతున్న 35 ఏళ్ల మహిళ ఒకరు 2022లో ఇతడిని సంప్రదించింది. ఆమె భర్తకు ప్రాణగండం ఉందని, ప్రత్యేక పూజలతో దానిని నివారిస్తానని నమ్మబలికాడు. అనంతరం ఆమెకు మత్తుమందు కలిపిన పానీయం ఇచ్చి, హిప్నటైజ్ చేసి, భయపెట్టి 2025 డిసెంబర్ వరకు పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన నాసిక్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు, కారట్ ఫార్మ్‌హౌస్‌పై దాడి చేసి చాకచక్యంగా అతడిని అరెస్టు చేశారు. ఈ సోదాల్లో ఒక పిస్టల్, బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతని కార్యాలయంలో రహస్యంగా అమర్చిన సీసీటీవీ కెమెరాలను గుర్తించారు. అక్కడ లభించిన ఒక పెన్‌డ్రైవ్‌లో 58 మంది వేర్వేరు మహిళలపై లైంగిక దాడి చేస్తున్న వీడియోలు ఉండటంతో పోలీసులు నిర్ఘాంతపోయారు. మత్తుమందులు, చేతబడి వంటివి ప్రయోగించి మహిళలను లొంగదీసుకుని, ఆ దృశ్యాలను రికార్డు చేసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ కేసులో రాజకీయ, సినీ, వ్యాపార ప్రముఖులతో

ఖారట్‌కు సంబంధాలు ఉన్నాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రూపాలి చకణ్‌కర్‌పై కూడా విమర్శలు రావడంతో ఈ కేసు రాజకీయంగానూ దుమారం రేపింది. దీంతో ప్రభుత్వం ఐపీఎస్ అధికారిణి తేజస్వినీ సత్పుతే నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేసింది. సిట్ అధికారులు వీడియోలను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపి, ఇతర బాధితులను గుర్తించే పనిలో పడ్డారు. నిందితుడిపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 64 (రేప్), బ్లాక్ మ్యాజిక్ చట్టం కింద కేసులు నమోదు చేసిన పోలీసులు, అతడిని కోర్టులో హాజరుపరచగా మార్చి 24 వరకు కస్టడీకి అప్పగించారు. సిట్ దర్యాప్తులో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## తెలంగాణ అసెంబ్లీ, మండలిలో ప్రభుత్వ విప్‌ల నియామకం

- మొదటి పేజీ తరువాయి

విప్‌లుగా పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఉన్నారు.

## ఇరాన్ యుద్ధం దేశానికే కాదు ప్రపంచానికి పరీక్ష సమయం

- మొదటి పేజీ తరువాయి

తెలిపింది. ఈ మేరకు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ మీడియాతో మాట్లాడుతూ, పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని అన్నారు. కువైట్ యువరాజుతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారని జైశ్వాల్ తెలిపారు. ఆయా దేశాలు, భాగస్వామ్య పక్షాలతో దౌత్యపరంగా చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. ఈ చర్చల ఫలితంగా రెండు ఎల్పీజీ నౌకలు హర్మూజ్ జలసంధి ద్వారా మనదేశానికి చేరుకున్నాయని తెలిపారు. చిన్న, మధ్య తరహా, ఇతర వినియోగదారులకు పంపిణీ చేసేందుకు గాను రాష్ట్రాలకు అధిక పరిమాణంలో బొగ్గును కేటాయించాలని బొగ్గు మంత్రిత్వ శాఖ ఇప్పటికే కోల్ ఇండియా, సింగరేణి కాలరీస్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు కేంద్ర అధికారులు వెల్లడించారు.

## 99 రోజుల తర్వాత జైలు నుంచి పిన్నెల్లి విడుదల.. ఎవరినీ వదిపెట్టబోమని హెచ్చరిక!



పల్నాడు రాజకీయాల్లో కీలక నేత, వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జైలు నుంచి విడుదలయ్యారు. తెలుగుదేశం పార్టీ నాయకుల జంట హత్య కేసులో నిందితుడిగా ఉన్న ఆయనకు గురజాల కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో, నేడు ఆయన నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి బయటకు వచ్చారు. ఈ సందర్భంగా జైలు వెలుపల వైసీపీ ముఖ్య నేతలు, భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. జైలు నుంచి విడుదలైన అనంతరం పిన్నెల్లి మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనపై నమోదైన కేసులు కేవలం రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని ఆయన మండిపడ్డారు. "వెల్దుర్తి మండలంలో జరిగిన టీడీపీ వర్గాల అంతర్గత గొడవలకు, నాకు ఎలాంటి సంబంధం లేదు. ఆధిపత్య పోరులో జరిగిన హత్యల ఘటనలో నన్ను ఉద్దేశపూర్వకంగా నిందితుడిగా ఇరికించారు" అని ఆయన స్పష్టం చేశారు. నాడు జిల్లా ఎస్పీ సైతం ఈ ఘటనను ఇరువర్గాల మధ్య జరిగిన పోరుగా తేల్చినప్పటికీ, ప్రభుత్వం తనను అన్యాయంగా 99 రోజులు జైల్లో పెట్టి మానసిక క్షోభకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. "భవిష్యత్తులో మాకు తప్పకుండా ఒక రోజు వస్తుంది. ఆరోజు దీని వెనుక ఉన్న ప్రతి ఒక్కరినీ బయటకు లాగుతాం. రాజకీయ నాయకులైనా, అధికారులైనా సరే... చట్టం ముందు నిలబెట్టి తీరుతాం. ఎవరినీ వదిలిపెట్టే సమస్యే లేదు" అని ఆయన హెచ్చరించారు. పిన్నెల్లి విడుదలతో మాచర్ల, వెల్దుర్తి ప్రాంతాల్లోని వైసీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. అయితే, ఇదే కేసులో ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డికి బెయిల్ నిరాకరించడంతో ఆయన ఇంకా జైలులోనే ఉన్నారు.

## హర్యానాలో ఆరేళ్లలో గుండెపోటుతో 17,973 మరణాలు

రాష్ట్రంలో 2020 జనవరి నుంచి 2026 జనవరి మధ్య కాలంలో 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గలవారు వేల సంఖ్యలో గుండెపోటుతో మరణించినట్లు అసెంబ్లీలో హర్యానా ప్రభుత్వం వెల్లడించింది. ఈ ఆరేళ్ల కాలంలో 17,973 మంది గుండెపోటు కారణంగా మరణించినట్లు అసెంబ్లీలో తెలిపింది. యువతలో గుండెపోటు కారణంగా సంభవించిన మరణాలపై అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రశ్నించారు. గత ఆరేళ్ల కాలంలో ఏ జిల్లాలో, ఎంతమంది, ఎంత వయస్సు కలిగిన వారు, హార్ట్ ఫెయిల్ కారణంగా మరణించారో తెలియజేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అడిగారు. ఈ మరణాలకు కరోనా వైరస్, కొవిడ్ వ్యాక్సిన్‌తో సంబంధం ఉందా, ఆ దిశగా ఏమైనా చర్యలు చేపట్టారా? అని ప్రశ్నించారు. అలాంటి సర్వేను నిర్వహించలేదని ప్రభుత్వం అసెంబ్లీలో తెలిపింది. జిల్లాల వారీగా, ఏ సంవత్సరంలో ఎంతమంది గుండెపోటుతో మరణించారో తెలిపింది. సంవత్సరాల వారీగా చూస్తే, 2020లో 2,394 మరణాలు సంభవించగా, 2021లో 3,188, 2022లో 2,796, 2023లో 2,886, 2024లో 3,063, 2025లో 3,255 మరణాలు జరిగినట్లు తెలిపింది. 2026 జనవరిలో 391 గుండెపోటు మరణాలు నమోదైనట్లు తెలిపింది.

# సంపాదకీయం

## ప్రతీకారంతో ఇరాన్

గల్ఫ్ ప్రాంతంలో చమురు, వాయువు కేంద్రాలపై ఇరాన్ గురువారం దాడులు పెంచింది. ఇప్పటికే కొనసాగుతున్న యుద్ధానికి ఇది మరింత తీవ్రత తీసుకొచ్చింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై దీని ప్రభావం కనిపిస్తోంది. ఇజ్రాయెల్ ఇరాన్ కీలక వాయువు క్షేత్రంపై దాడి చేసిన తర్వాత ప్రతీకారంగా ఈ దాడులు చేపట్టింది. దీంతో ఇంధన ధరలు ఒక్కసారిగా ఎగిసిపడ్డాయి గల్ఫ్ దేశాలు కూడా నేరుగా యుద్ధంలోకి దిగే అవకాశం ఉందన్న ఆందోళన పెరిగింది. హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టు ఉండటం వల్ల ఇప్పటికే ఒత్తిడిలో ఉన్న ప్రపంచ చమురు సరఫరా మరింత ఇబ్బందుల్లో పడింది.

**యూఏఈ తీరంలో...**

యూఏఈ తీరంలో ఓ నౌకకు మంటలు అంటుకున్నాయి. ఖతర్ సమీపంలో మరో నౌక దెబ్బతినింది. హోర్ముజ్‌కు ప్రత్యామ్నాయ మార్గాలు కూడా భద్రంగా లేవని స్పష్టమైంది. ఎర్ర సముద్రం వద్ద సౌదీ రిఫైనరీపై ఇరాన్ డ్రోన్ దాడి చేసింది. అంతర్జాతీయ ప్రమాణమైన బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 118 డాలర్ల వరకు చేరింది. ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్, అమెరికా దాడులు మొదలైన తర్వాత ఇది 60 శాతానికి పైగా పెరిగింది. ఇంధన ధరల ప్రభావంతో జరగనున్న యూరోపియన్ యూనియన్ సమావేశానికి ముందే ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ పరిస్థితిని తీవ్రంగా అభివర్ణించారు. యుద్ధ విరమణ, చర్చలు అవసరమని కోరారు.

**గల్ఫ్ దేశాల్లో దాడులు...**

ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ ఇరాన్ చర్యలను ఖండించాయి. అరబ్ లీగ్ ప్రధాన కార్యదర్శి అహ్మద్ అబౌల్ ఘైట్ దీనిని ప్రమాదకర ఉద్రిక్తతగా పేర్కొన్నారు. సౌదీ అరేబియా రాజధాని రియాద్, తూర్పు ప్రాంతాల్లో ఆరు డ్రోన్లను అడ్డుకుంది. యన్బూ పోర్టులోని సామ్‌రెఫ్ రిఫైనరీపై దాడి జరిగినట్లు తెలిపింది. హోర్ముజ్ మార్గాన్ని తప్పించేందుకు సౌదీ ఇప్పటికే ఎర్ర సముద్రం వైపు చమురు తరలిస్తోంది. ఖతర్‌లోని రాస్ లాఫాన్ ఎల్ఎన్జీ కేంద్రంపై క్షిపణులు పడటంతో భారీ నష్టం వాటిల్లింది. అక్కడ మంటలను అగ్నిమాపక సిబ్బంది ఆర్పారు. ముందస్తు దాడుల వల్ల ఉత్పత్తి ఇప్పటికే ఆగిపోయింది. ఇది ప్రపంచానికి వాయువు సరఫరాపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

**గ్యాస్ నిక్షేపాలపై దాడులతో...**

కువైట్‌లోని మీనా అల్-అహ్మది రిఫైనరీలో డ్రోన్ దాడితో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సమీపంలోని మీనా అబ్దుల్లా కేంద్రంలో కూడా మంటలు చెలరేగాయి. అబుదాబిలోని హబ్‌షాన్ గ్యాస్ కేంద్రం, బాబ్ ఫీల్డ్ కార్యకలాపాలు నిలిపివేశారు. ఇరాన్ దాడులు ప్రమాదకరంగా మారుతున్నాయని అధికారులు తెలిపారు. ఇజ్రాయెల్‌పై కూడా ఇరాన్ క్షిపణి దాడులు కొనసాగుతున్నాయి. పలుచోట్ల భవనాలు దెబ్బతిన్నా ప్రాణనష్టం పెద్దగా లేదు. ప్రపంచంలో అతిపెద్ద వాయువు క్షేత్రంగా గుర్తింపు పొందిన సౌత్ పార్స్‌పై ఇజ్రాయెల్ దాడి చేసింది. ఇది ఇరాన్, ఖతర్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రాజెక్టు. ఇరాన్‌లో విద్యుత్ ఉత్పత్తిలో సుమారు 80 శాతం సహజ వాయువుపైనే ఆధారపడుతోంది. దీంతో ఈ దాడి దేశ విద్యుత్ సరఫరాపై నేరుగా ప్రభావం చూపే అవకాశం ఉంది.

**ఈ దాడితో మరింత తీవ్రతరం...**

ఈ దాడితో యుద్ధం మరింత విస్తరించినట్లు పరిశోధనా సంస్థలు పేర్కొన్నాయి. ప్రజల జీవన పరిస్థితులను కష్టతరం చేయాలనే ఉద్దేశంతో ఇజ్రాయెల్ లక్ష్యాలను ఎంచుకుంటోందని విశ్లేషించాయి. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ దాడులు నియంత్రణ తప్పితే ప్రపంచానికే ముప్పు ఉంటుందని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఇరాన్ ఖతర్ శక్తి కేంద్రాలపై దాడులు కొనసాగిస్తే అమెరికా కూడా ప్రతిస్పందిస్తుందని హెచ్చరించారు.

**ప్రదర్శనల్లో అరెస్టయిన ముగ్గురికి ఉరి**

జనవరిలో జరిగిన నిరసనల సమయంలో అరెస్టైన ముగ్గురిని ఇరాన్ ఉరిశిక్ష అమలు చేసింది. కోమ్ నగరంలో ఇద్దరు పోలీసులను హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆందోళనలను అణచివేసే సమయంలో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది మందిని అదుపులోకి తీసుకున్నారు. విచారణల్లో న్యాయం జరగడం లేదని హక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. మూడో వారంలోకి ఇరాన్ - ఇజ్రాయిల్ యుద్ధం చేరింది. మృతుల సంఖ్య కూడా పెరుగుతోంది. యుద్ధంలో ఇప్పటివరకు ఇరాన్‌లో 1,300 మందికిపైగా మరణించారు. లెబనాన్‌లో హిజ్బుల్లా దాడుల కారణంగా 10 లక్షల మందికి పైగా ప్రజలు నివాసాలు విడిచారు. 900 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఇజ్రాయెల్‌లో ఇరాన్ క్షిపణి దాడుల్లో 15 మంది మృతిచెందారు. వెస్ట్ బ్యాంక్‌లో నలుగురు మరణించినట్లు అధికారులు తెలిపారు.

## ఉద్యమ సభ్యత్వ నమోదు గడువు పొడిగింపుని సద్వినియోగం చేసుకోండి

**జనసేన అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీరవెంకట్**



**గూడెం కొత్త వీధి,పబ్లిక్ వ్యూ మార్చి 19:** జనసేన పార్టీ ఉద్యమ సభ్యత్వ నమోదుకు గడువును పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పొడిగించారని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ పార్టీ అరకు పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ గొర్లె వీరవెంకట్ సూచించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనసేన క్రియాశీలక సభ్యత నమోదు, రెన్యువల్ కార్యక్రమం వాస్తవానికి ఈనెల 17 తో ముగిసింది అన్నారు. అయితే మరింత మందికి సభ్యత్వ నమోదు చేసుకునే అవకాశం కల్పించేందుకు అధిష్టానం గడువును పొడిగించిందని తెలిపారు. ఈనెల 24 వరకు సభ్యత నమోదు చేసుకునేందుకు వీలుందని పేర్కొన్నారు. ఈ జనసేన సభ్యత్వం వల్ల కష్ట సమయంలో పార్టీ అండగా ఉండడంతో పాటు రూ. 5. లక్షల వరకు బీమా సౌకర్యం కలుగుతుందన్నారు. ఆసక్తిగల ప్రజలు అవకాశాన్ని సద్వినిగం చేసుకోవాలని సూచించారు.

## గరుడాద్రి వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉగాది సంబరాలు



**గాజువాక: పబ్లిక్ వ్యూ ,మార్చి 19** జీవీఎంసీ 65వ వార్డు బానోజీ తోట వంబే కాలనీ గరుడాద్రి కొండపై వెలసిన వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉగాది సంబరాలు అంగరంగ వైభవంగా ఆలయ ధర్మకర్త మంజుల, ఆలయ చైర్మన్ దొడ్డి రమణ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ భక్తులచే ఉత్సవ విగ్రహాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఉదయం నుండి పంచాంగ శ్రవణం వేదం పండితులచే నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ జరిగినది. వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ వారిచే కోలాటం నత్య ప్రదర్శన జరిగినది. మ...

## ఉగాది వేడుకల్లో జగన్మోహన్ రెడ్డి ఆశీర్వాదం తీసుకున్న ఎంపీ డాక్టర్ తనూజారాణి



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,మార్చి 19పబ్లిక్ వ్యూ :** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం వైభవంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి దంపతులు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. సాంప్రదాయ పంచెకట్టు, భుజాన కండువాతో వచ్చిన జగన్‌కు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించగా, దంపతులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఉగాది పర్వదినాన సందర్భంగా అరకు ఎంపీ డాక్టర్ గుమ్మడి తనూజ రాణి జగన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వాదం తీసుతీసుకున్నారు. ఉగాది సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఇంటర్మీడియట్, పదవ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత శిక్షణ. సాన్ చారిటీ ఫౌండర్ సూ రెడ్డి అప్పలనాయుడు.






**చింతపల్లి పబ్లిక్ వ్యూ మార్చి 19.** ఇంటర్మీడియట్, పదవ తరగతి విద్యార్థులకు ఎంసెట్ నీట్ పాలిసెట్ లలో ఉచిత కోచింగ్ ను అందిస్తున్నట్లు సాన్ చారిటీ ఫౌండర్ సూరెడ్డి అప్పలనాయుడు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నర్సీపట్నంలో గత ఐదు సంవత్సరాలుగా సాన్ ఎడ్యుకేషనల్ సొసైటీ మరియు చారిటీ ఆధ్వర్యంలో ఎస్ కృష్ణ సహకారంతో ఎంసెట్ నీట్ పాలిసెట్ ఇంటర్మీడియట్ మరియు పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో మాదిరిగా ఈ ఏడాది కూడా తేదీ 25.03.2026 నుండి నుండి 02.04.2036 వరకు పాలిసెట్ లో ఉచిత కోచింగ్ నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగానున్న సాన్ ఎడ్యుకేషనల్ ప్రారంభించామని తెలిపారు. ఈ సదవకాశాన్ని విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9493295639, 8247300921 నంబర్లకు సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఉమామహేశ్వరి, ఆర్గనైజర్ ఎస్ కృష్ణ పాల్గొన్నారు.

# నవరస పద్య సుధా సమ్మేళనం






**అమలాపురం (పబ్లిక్ వ్యూ) మార్చ్ 19:** ఆ కొండ సింహాచలం సర్వేశ్వర్ ఆధ్వర్యంలో స్థానికల ఎర్రమిల్లి వారి వీధిలోని హనుమాన్ మందిరమందు ఉగాది పర్వదినాన గురువారం 19వ తేదీన నవరస పద్య సదా సమ్మేళనం పేరిట పాత కవుల యొక్క నవరసాల కవితలను తొమ్మిది మంది కవులు కవిత గానం చేశారు. ఈ కార్యక్రమానికి ముందుగా ట్రస్ట్ చైర్మన్ ఆకొండి పవన్ కుమార్ శర్మ పరాభవ నామ సంవత్సర పంచాంగ శ్రవణాన్ని పఠించారు. ఈ కార్యక్రమానికి అమలాపురం రోటరీ క్లబ్, అమలాపురం సంస్కార భారతి శాఖ, జే సి ఐ అమలాపురం సహ ప్రాయోజకులుగా వ్యవహరించారు.

ఈ కవితా సమ్మేళనం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. పల్లిపాలెం ఆంధ్ర కుటీరం వ్యవస్థాపకులు మధునాపంతుల సత్యనారాయణ మూర్తి ఈ నవరస కవితా సమ్మేళనంపై సమీక్ష చేశారు.

# ఉగాది వేడుకల్లో విశాఖకు శుభసూచనలు

**అభివృద్ధి దిశగా 'పరాభవ' నూతన సంవత్సరంపై ఆశావహ అంచనాలు**







**విశాఖ దక్షిణం, పబ్లిక్ వ్యూ , మార్చి 19 :** శ్రీ పరాభవ నామ సంవత్సరంలో విశాఖపట్నం జిల్లా అభివృద్ధి పథంలో మరింత వేగంగా ముం దుకు సాగుతుందని పంచాంగ కర్తలు ఆశాభా వం వ్యక్తం చేశారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యం లో వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో ఘనంగా నిర్వహించిన ఉగాది వేడుకల్లో నూతన సంవ త్సర ఫలితాలను వారు వెల్లడించారు. పంచాంగ కర్తలు బ్రహ్మశ్రీ అక్కాజోస్యుల రమేశ్ శర్మ, గిరి శ్రీనివాస శర్మ మాట్లాడుతూ దేశ, రాష్ట్రాల ఆర్థిక వృద్ధి రేటు పెరిగే అవకాశాలు ఉన్నాయని, ని త్యావసర వస్తువుల ధరలు తగ్గుముఖం పట్టవ చ్చని పేర్కొన్నారు. వ్యవసాయం, సాంకే తిక రంగాల్లో పురోగతి కనిపిస్తుందని, కార్మిక, కర్షక వర్గాలకు ఈ సంవత్సరం లాభదాయకంగా ఉం డొచ్చని అభిప్రాయపడ్డారు. భూముల ధరలు పెరగడం, పరిశ్రమల కార్యకలాపాలు చురుకు దనం పొందడం వంటి పరిణామాలు చోటుచే సుకుంటాయని, విద్య, వైద్య రంగాల్లో కొత్త పరిశోధనలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో భారత ఖ్యాతి మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని కూడా చెప్పారు.

అయితే తుఫాన్లు, భూకంపాలు, రోడ్డు ప్రమాదా లు వంటి సహజ, అనివార్య పరిస్థితులు తలెత్తే అవకాశాలున్నప్పటికీ, పరిపాలనా సమర్థతతో నష్టాలను తగ్గించవచ్చని సూచించారు. రైతులకు ఈ సంవత్సరం అనుకూలంగా ఉండి, వర్షపాతం సహకరించే అవకాశముందని పేర్కొ న్నారు. కొత్త రోగాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**ఉత్సాహంగా ఉగాది వేడుకలు**

వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో జరిగిన ఉగాది వేడుకలు వేదపారాయణాలు, శాస్త్రోక్త పూజల మధ్య వైభవంగా జరిగాయి. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్ తదితరులు పాల్గొన్నారు. వేదపండితులు పూర్ణకుంభంతో అతిథులను ఆహ్వానించారు.

**వినయంతో జీవించడం అవసరం గంటా**

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉగాది కొత్త ఆరంభాలకు ప్రతీక అని, అహం కారం విడిచి వినయంతో జీవించడం ద్వారా సమాజంలో ఐక్యత పెరుగుతుందని అన్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడు కోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు. అభివృద్ధితో పాటు సాంస్కృతిక విలువలను కూడా పరిరక్షించాల్సిన అవసరం ఉందని సూచించారు.

**పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం**

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఉగాది పండుగ జీవన సారాన్ని తెలియజేస్తుందని చెప్పారు. నగర పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలో ప్రజలు చురుకుగా పాల్గొనాలని కోరారు. ప్రభుత్వం–ప్రజలు కలిసి కట్టుగా పనిచేస్తేనే నగరాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లగలమన్నారు.

**విశాఖకు కొత్త అవకాశాల దిశగా అడుగులు**

వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్ మాట్లాడుతూ విశాఖపట్నం రానున్న రోజుల్లో సంక్షేమం, అభి వృద్ధి రంగాల్లో కొత్త మైలురాళ్లు సాధిస్తుం దని అన్నారు. ప్రభుత్వం, సంస్థలు, ప్రజలు కలిసి పనిచేస్తే నగరం మరింత ముందుకు సాగుతుం దని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కవి సమ్మేళనం ప్రత్యేక ఆకర్ష ణగా నిలిచాయి. కళాకారులను అతిథులు సత్కరించారు.

## చోరీకి గురైన ద్విచక్ర వాహనాలు స్వాధీనం

**ఒడిస్సాలోని రాణి తోట ఔట్ పోస్ట్ స్టేషన్లో ద్విచక్ర వాహనాలు గుర్తింపు.**

**పనస, గతురముండా గ్రామాలకు చెందిన గోపాల్, గోపీనాథ్ ల ద్విచక్ర వాహనాలు.**

**వనగుమ్మ పంచాయతీ సర్పంచ్ కిరసాని మిల్కీ, వైసిపి నేత కే నీలకంఠం.**



**ముంచంగిపుట్టు, పబ్లిక్ వ్యూ , మార్చి 19.** చోరీకి గురైన రెండు ద్విచక్ర వాహనాలు ఒడిస్సాలో స్వాధీనం చేసుకున్నట్లు వైసీపీ నేత కిరసాని నీలకంఠం అన్నారు. గురువారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా, ముంచంగిపుట్టు మండలం, వనుగుమ్మ పంచాయితీ, పనస గ్రామస్తుడు వంతాల గోపాల్ యొక్క ద్విచక్ర వాహనం ( హీరో స్ప్లెండర్) తో పాటు దొడిపుట్టు పంచాయితీ, గతూరుముండ గ్రామస్తుడు కిముడు గోపీనాథ్ కు చెందిన 220 పల్సర్ బైక్ లు ఈ నెల 7వ తేదీన రాత్రి సుమారు 1: 30 గంటల సమయంలో చోరీకి గురయ్యాయన్నారు. ఈ విషయమై ముంచంగిపుట్టు పోలీస్ స్టేషన్ లో, ఒడిస్సా మాచ్ఖండ్ పోలీస్ స్టేషన్ లలో 8వ తేదీన ఫిర్యాదు చేశామన్నారు. ద్విచక్ర వాహనాలు కోసం వెతికే క్రమంలో ఈ నెల 17వ తారీఖున ఒడిస్సా రాష్ట్రంలోని లమతపుట్టు బ్లాక్, నందపూర్ పోలీస్ స్టేషన్ సర్కిల్, రాణితోట అవుట్ పోస్ట్ స్టేషన్లో ఉన్నట్లు తమకు సమాచారం అందిందని, దీంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా రెండు ద్విచక్ర వాహనాలు కూడ తమవిగా గుర్తించామన్నారు. అక్కడ పోలీసు అధికారులతో ద్విచక్ర వాహనాల చోరీ విషయమై వివరణ కోరగా స్టేషన్ పరిధిలో కప్పుగూడ ప్రాంతంలో ఓ ప్రదేశంలో రెండు ద్విచక్ర వాహనాలు ఉన్నట్లు తమకు సమాచారం అందిందని, దీంతో వాహనాలను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపినట్లు వారు పేర్కొన్నారు. ముంచంగిపుట్టు పోలీస్ స్టేషన్ ఎస్ఐతో సంప్రదింపులు జరిపి ఒడిస్సా నుంచి ద్విచక్ర వాహనాలను 18 తేదీన తీసుకువచ్చినట్లు నీలకంఠం తెలిపారు. చోరీకి గురైన ద్విచక్ర వాహనాల కొరకు అహర్నిశలు శ్రమించి గాలింపు చర్యలు చేపట్టిన ముంచంగిపుట్టు ఎస్సై పి నానీకు, సర్పంచ్ మిల్కీకు, వైసీపీ నేత నీలకంఠంకు ద్విచక్ర వాహనదారులు ప్రసాద్, గోపీనాథ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిముడు ఉర్దేవ్, కిల్లో లక్ష్మణరావు, వంతాల గోపాల్, వంతాల గోపాల్, వంతాల రామచందర్, కిల్లో మూర్తీ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పదవి కొత్త కాదు,నిర్ణయం సీఎం దే గంటా శ్రీనివాసరావు



**బిమిలి,పబ్లిక్ వ్యూ ,మార్చి 19 :** మంత్రి పదవి తనకు కొత్త విషయం కాదని భీమి లి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశా రు. ఉగాది సందర్భంగా గురువారం ఆశీలుమె ట్టలోని సంపత్ వినాయకర్ ఆలయాన్ని సంద ర్శించిన అనంతరం ఆయన మీడియాతో మా ట్లాడారు. త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉంటుం దని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో మంత్రి పదవి ఆశిస్తున్నారా అనే ప్రశ్నకు స్పందించిన గంటా.. మంత్రివర్గంలో ఎవరిని చేర్చాలి, ఎవ రిని తప్పించాలి అనే విషయంలో ముఖ్యమంత్రి కు పూర్తి అవగాహన ఉందన్నారు. దేశంలోనే అనుభవజ్ఞుడైన నాయకుడిగా ఉన్న చంద్రబా బు నాయుడు సరైన సమయంలో సరైన నిర్ణ యం తీసుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి మంత్రివర్గ విస్తరణపై వస్తున్న వార్త లు ఊహాగానాలేనని వ్యాఖ్యానించారు.

ఉగాది సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజ లు నిర్వహించిన గంటా శ్రీనివాసరావుకు ఆలయ అర్చకులు ఆశీర్వాదాలు అందజేశారు.

## అర్వీనగర్ లో మహా అన్న ప్రసాదం పంపిణీ

**తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అరికట్ల ఆంజనేయుల వితరణ**





**గూడెం కొత్త వీధిపబ్లిక్ వ్యూ మార్చి 19:** మండలంలోని ఆర్వీనగర్ లో మహా అన్నప్రసాదం పంపిణీ ఘనంగా జరిగింది. గ్రామంలో నూకాంబిక అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ఉగాది పర్వదినం గురువారం భక్తులకు అన్నప్రసాదం అందించేందుకు గ్రామానికి చెందిన అరికట్ల ఆంజనేయులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. తన తల్లిదండ్రులు అరికట్ల వెంకటరమణ, సుశీలమ్మ జ్ఞాపకార్థం ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆర్వి నగర్ యువత మహిళలు గ్రామ పెద్దల సహకారంతో సుమారు 2000 మందికి అన్న ప్రసాదం అందజేశారు. గ్రామంలో ఏ కార్యక్రమమైనా ముందుండి నడిపిస్తూ భక్తులకు అన్నప్రసాదం అందజేసిన ఆరికట్ల ఆంజనేయుల కుటుంబానికి పలువురు అభినందించారు. ఈ అన్నదాన పంపిణీ కార్యక్రమాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ జిల్లా కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్, వార్డెన్ల సంఘం అధ్యక్షుడు పసుపులేటి వినాయక దంపతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్ , బిజెపి నాయకులు రీమల పౌల్ , జీకే వీధి మండలం విలేకరుల సంఘం అధ్యక్షుడు సాయం రమణ, పలువురు రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

# ఉగాది వేడుకలతో కళకళలాడిన పారిశ్రామిక ప్రాంత విలేకరుల సంఘం





**ములగాడ, పబ్లిక్ వ్యూ మార్చి 19 :** తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పు రస్కరించుకొని పారిశ్రామిక ప్రాంత విలేకరుల సంఘం ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు ఘనం గా నిర్వహించబడ్డాయి. స్థానిక శ్రీహరిపురంలో ని వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమా నికి సంఘ అధ్యక్షుడు ముప్పిడి వెంకటగిరి అధ్యక్షత వహించారు. ఈ వేడుకలకు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబా బు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన తో పాటు జనసేన పార్టీ రాష్ట్ర మహిళా నాయ కురాలు అంగ ప్రశాంతి, మల్కాపురం సీఐ గొల గాని అప్పారావు, సీనియర్ పాత్రికేయుడు మరియు కళారత్న అవార్డు గ్రహీత సుంకర చలపతిరావు, అభయ ఆంజనేయస్వామి ఆలయ ట్రస్టు చైర్మన్ సత్యాల శ్రీను, 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్న తదితరులు పాల్గొ న్నారు. కార్యక్రమం ప్రారంభంలో పండితులచే పంచాంగ శ్రవణం నిర్వహించగా, అతిథులు, సభ్యులు ఆసక్తిగా ఆలకించారు. అనంతరం కవి సమ్మేళనం నిర్వహించగా, కవులు తమ కవి త్వంతో సభను అలరించారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే గణబాబును సంఘ సభ్యులు సాలు వాతో సత్కరించి, ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవమైన సింహాద్రి అప్పన్న విగ్రహాన్ని బహుకరించారు. అలాగే ఆయన చేతుల మీదుగా అంగ ప్రశాంతి, సీఐ అప్పారావు, సుంకర చలపతిరావు, సత్యా ల శ్రీను తదితరులతో పాటు కవులు, పురోహి తులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

తదుపరి వక్తలు మాట్లాడుతూ ఉగాది సంద ర్భంగా పంచాంగ శ్రవణంతో పాటు కవి సమ్మేళ నం నిర్వహించడం ఆనందదాయకమని, ఇటు వంటి కార్యక్రమాలు సాంస్కృతిక విలువలను పరిరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పే ర్కొన్నారు. ఇదే సందర్భంగా పాత్రికేయ రంగం లో 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఆంధ్ర జ్యోతి దినపత్రికకు చెందిన ముప్పిడి వెంకట గిరిని ఎమ్మెల్యే గణబాబు, సంఘ సభ్యులు కలిసి సాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

ఈ కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంతానికి చెం దిన పలువురు పాత్రికేయులు, శ్రేయోభిలా షులు పాల్గొన్నారు.

## తాజా మాజీలకు మాజీ ఎమ్మెల్యే సన్మానం



**నర్సీపట్నం,పబ్లిక్ వ్యూ (మార్చి 19) :** నర్సీపట్నంలో తాజాగా మాజీలైన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లకు మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ సన్మానం చేశారు. పెదబొడ్డేపల్లి పార్టీ కార్యాలయంలో ఇటీవల ఐదు సంవత్సరాల పదవి కాలం పూర్తి చేసుకున్న పార్టీ కౌన్సిలర్లను సాలువతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి మాట్లాడుతూ దళిత మహిళకు చైర్ పర్సన్ గా అరుదైన అవకాశం ఇచ్చి, గౌరవించిన మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ఉమాశంకర్ గణేష్ నాయకత్వంలో మళ్లీ మున్సిపాలిటీని గెలుచుకునేలా అందరం కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఉమాశంకర్ గణేష్ దంపతులు వైసిపి కౌన్సిలర్లను కుటుంబ సమేతంగా సత్కరించారు. అనంతరం అందరూ కలిసి ఉగాది పచ్చడి తింటూ, ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

## ఉగాది వేడుకల్లో భక్తులతో కళకళలాడిన కనక మహాలక్ష్మి ఆలయం



**విశాఖ దక్షిణం పబ్లిక్ వ్యూ , మార్చి 19 :** శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం ఉదయం భక్తిశ్రద్ధలతో పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అనివెట్టి మండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు.

ముందుగా దేవస్థాన అర్చకులు గణపతి పూజ, మండపారాధన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేద పండితుడు శ్రీ ముష్టి వెంకటేశ్వర ఘణాపాఠి పంచాంగ శ్రవణం చేసి, కొత్త సంవత్సర ఫలితాలను వివరించారు. తదుపరి వేద ఆశీర్వచనం కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా భక్తులకు ఉగాది పచ్చడి, తీపి బూందీతో పాటు పంచాంగాలు పంపిణీ చేశారు. ఉగాది పర్వదినం లక్ష్మివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆలయ పరిసర ప్రాంతం భక్తులతో నిండిపోగా, ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ఇదే సందర్భంలో ఉదయం 9 గంటల నుండి సాయం త్రం 5.30 గంటల వరకు అమ్మవారు స్వర్ణాభ రణ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సహాయ కార్య నిర్వాహక అధికారులు కె. రాజేంద్ర కుమార్, ఎన్. ఆనంద్ కుమార్, పర్యవేక్షణాధికారులు ఎం.వి. రమణ, ఎస్. కనకరాజు, బి. అనురా ధతో పాటు వేద పండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ఉగాది -- రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



**అనకాపల్లి, పబ్లిక్ వ్యూ , మార్చి 19 :** తెలుగు నూతన సంవత్సర ఆరంభాన్ని సూచించే 'పరాభవ నామ సంవత్సరం ఉగాది' మరియు ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ సందర్భంగా అనకాపల్లి జిల్లా ప్రజలందరికీ జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఉగాది పర్వదినం జిల్లాలోని ప్రతి కుటుంబానికి కొత్త ఆశలు, కొత్త వెలుగులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని కోరారు. రంజాన్ పండుగ క్రమశిక్షణ, దాతృత్వం, పవిత్రతకు ప్రతీక అని పేర్కొన్న ఎస్పీ, ముస్లిం సోదర సోదరీమణులు ఈ పండుగను భక్తిశ్రద్ధలతో, ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. సమాజంలో శాంతి, సోదరభావం పెరగాలి ఈ పర్వదినాలు సమాజంలో శాంతి, ప్రేమ, సోదరభావాన్ని మరింత బలపరచాలని ఆయన అభిలషించారు. అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో పండుగలను జరుపుకోవాలని సూచించారు. అల్లాహ్ ఆశీస్సులు మరియు ప్రకృతి దీవెనలతో జిల్లా ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని కోరుతూ, పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు.

# యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వం లక్ష్యం

## - ఉగాది రోజు జాబ్ క్యాలెండర్ విడుదల యువతలో ఆనందం: మొల్లి పెంటిరాజు



**గాజువాక పబ్లిక్ వ్యూ ,మార్చి 19 :** ఉగాది పర్వదినాన్న రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా నిరుద్యోగ యువతకు ఒక శుభవార్త వచ్చేలా కూటమి ప్రభుత్వం జాబు క్యాలెండర్ ప్రకటించింది.

ఈ సందర్భంగా విశాఖ జిల్లా తెలుగు ఆధ్వర్యంలో జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మొల్లి పెంటిరాజు ముఖ్యఅతిథిగా, విశాఖ జిల్లా గాజువాక నియోజవర్గం కొత్త గాజువాక కూడలి వద్ద వందలాది నిరుద్యోగ యువతతో టపాకాయలు కాల్చి మిఠాయిలు తినిపించుకున్నారు నారా లోకేష్ ముఖచిత్రాలు వేసుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మొల్లి పెంటిరాజు మాట్లాడుతూ, ఇప్పటికే 20 నెలల్లోనే 6,28,347 ఉద్యోగాలను యువతకు అందించడం జరిగింది. వీటితో పాటు రూ.23 లక్షల కోట్ల పెట్టుబడితో 25 లక్షల ఉద్యోగ అవకాశాలు సృష్టించే కంపెనీలతో కూటమి ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు .పరాభవ నామ సంవత్సరం కానుక భారీగా ఉద్యోగ కల్పనకు శ్రీకారం చుట్టిందని , రాష్ట్రంలోని యువతకు బంగారు భవిష్యత్ అందించేందుకు జాబ్ క్యాలెండర్ ప్రకటించింది.

జాబ్ క్యాలెండర్లో ప్రధానంగా విద్య, పోలీస్ శాఖలకు పెద్దపీట వేయడం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించి భారీగా టీచర్ పోస్టులను భర్తీ చేసి, నేడు మరోసారి డీఎస్సీని, జూనియర్ లెక్చరర్ పోస్టుల కోసం 3,000 ఖాళీలను కేటాయిండం హర్షణీయమన్నారు .

ఉన్నత విద్యను బలోపేతం చేసే దిశగా వివిధ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 1,500 అధ్యాపక పోస్టులను భర్తీ చేస్తుంది. పరిపాలనా విభాగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాల కోసం దాదాపు 600 పోస్టులతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం 1,000 పోలీస్ కానిస్టేబుల్, 400 ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. నోటిఫికేషన్ విడుదల నుండి పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి, నియామక ప్రక్రియ ముగిసే వరకు ప్రతి దశకూ ఈ క్యాలెండర్లో స్పష్టమైన గడువులను ప్రభుత్వం నిర్ణయించింది. అభ్యర్థులు ఎటువంటి గందరగోళం లేకుండా తమ ప్రిపరేషన్ ను ప్రణాళికాబద్ధంగా కొనసాగించే వీలు కలుగుతుంది.

జాబ్ క్యాలెండర్ అంటే కేవలం ప్రకటన మాత్రమే కాదు, అది నిరుద్యోగులకు ఇచ్చే ఒక భరోసా" అనే సదుద్దేశంతో జాబ్ క్యాలెండర్ను ప్రకటించడం జరిగింది. పారదర్శకంగా, వేగవంతంగా నియామక ప్రక్రియ చేపట్టి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. నగరానికి పలు పరిశ్రమలు రాష్ట్రానికి క్యూ కడుతున్నాయని, ముఖ్యంగా అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ఆర్ఎస్ఎల్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ కర్మాగారం నూతనంగా మార్చి 23న శంకుస్థాపన జరుగుతుందని, దీనివలన ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాది ఉద్యోగాలు నిరుద్యోగ యువతకు వస్తాయని, విశాఖ స్టీల్ ప్లాంట్ ను చిత్తశుద్ధితో నష్టాల నుండి లాభాల బాట పట్టించి, త్వరలోనే అక్కడ నిర్వాసిత నిరుద్యోగులకు నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు కల్పించేలా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాజువాక నియోజకవర్గ ఎం ఎల్ ఏ పల్లా శ్రీనివాసరావు కృషి చేస్తున్నారని అన్నారు . తెలుగుయువత నాయకులు వియ్యపు నరేష్, షాలిన ఈశ్వరరావు, అయినంపూడి గోపాల సాయి వర్మ, ఒడిసెలా మహేష్ బాబు, చదరం తులసీరాం, సత్యనారాయణ, అప్పల రాజు, లోకేష్, గంగరాజు, ఇసరపు దొర బాబు, రాజు, స్థానిక నిరుద్యోగ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉగాది కానుకగా భారీ జాబ్ క్యాలెండర్ విడుదల

**యువత భవిష్యత్తుకు ప్రభుత్వం భరోసా ప్రభుత్వ విప్ గణబాబు**

**విశాఖ పశ్చిమ,పబ్లిక్ వ్యూ మార్చి 19 :** రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉగాది పర్వదినం సందర్భంగా ప్రభుత్వం గొప్ప కానుకను అందించిందని ప్రభుత్వ విప్ మరియు విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు తెలిపారు. గోపాలపట్నంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సుమారు 10,060 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి స్పష్టమైన కాలపరిమితితో కూడిన భారీ జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

**లక్ష్యసాధన దిశగా ప్రభుత్వం అడుగులు**

నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని గణబాబు పేర్కొన్నారు. ఇప్పటికే వివిధ రంగాల్లో 6,28,347 ఉద్యోగాలను అందించామని వివరించారు. ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌లో ముఖ్యమైన తేదీలు ఇలా ఉన్నాయి మే 15 యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 1500 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్, ఆగస్టు 15 గ్రూప్-1 (91 పోస్టులు), హోం శాఖ (2778 పోస్టులు), ఎక్సైజ్ తదితర శాఖల్లో 928 పోస్టులకు నోటిఫికేషన్లు, సెప్టెంబర్ 15 గ్రూప్-2 750 పోస్టులు, ఇంజనీరింగ్ 503 పోస్టులు, ఇతర శాఖల్లో 506 పోస్టుల భర్తీ, అక్టోబర్ 15 డీఎస్సీ ద్వారా పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 3004 పోస్టుల భర్తీ చేశారు. కేవలం నోటిఫికేషన్లు మాత్రమే కాకుండా, పరీక్షల నిర్వహణ నుంచి నియామక ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి దశను టైమ్ బౌండ్‌గా రూపొందించినట్లు ఆయన తెలిపారు. ఇది అభ్యర్థులకు నమ్మకాన్ని కలిగిస్తుందని అన్నారు. గత ఐదేళ్ల పాలనలో జాబ్ క్యాలెండర్ లేకపోవడం వల్ల యువతకు అన్యాయం జరిగిందని గణబాబు విమర్శించారు. పరిశ్రమలు దూరమై యువత భవిష్యత్తు దెబ్బతిన్నదని పేర్కొన్నారు. ప్రస్తుతం విశాఖ కేంద్రంగా అనేక ఎంఓయూలు కుదుర్చుకుంటూ, రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులతో 25 లక్షల ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. గత 20 నెలల్లో ఎంఎస్ఎంఈ, ఐటీ, పర్యాటక రంగాల్లో లక్షలాది ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. టెక్నాలజీ ఆధారంగా పారదర్శకంగా నియామకాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని, నిరుద్యోగుల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని గణబాబు స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



# సింహాచలం దేవస్థానంలో వైభవంగా ఉగాది వేడుకలు

**కళ్యాణ మహోత్సవానికి నాంది పలికిన పందిరి రాట ఉత్సవం**

**సింహాచలం, పబ్లిక్ వ్యూ , మార్చి 19 :** శ్రీ వరాహ లక్ష్మినరసింహస్వామివారి దేవస్థానం, సింహాచలంలో "శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది" పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం అత్యంత వైభవంగా వేడుకలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టిపి రాజగోపాల్, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో అర్చక స్వాములు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉగాది సందర్భంగా ఆలయ మండపంలో పంచాంగ పఠనం నిర్వహించబడింది. ఆలయ ప్రధాన అర్చకులు కరి సీతారామాచార్యులు నూతన సంవత్సరానికి సంబంధించిన ఫలితాలను భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జె. వెంకట్రావు ఆయనను ఘనంగా సన్మానించారు. దేవస్థానానికి విశిష్ట సేవలు అందించిన పలువురు ప్రముఖ పండితులను ఈ సందర్భంగా సత్కరించారు. సన్మానం పొందిన వారిలో దేవస్థాన పంచాంగ కర్త శ్రీ తెన్నేటి శ్రీనివాసాచార్య, విశ్రాంత ప్రధానాచార్యులు శ్రీ గొడవర్తి కృష్ణమాచార్యులు, శ్రీ భాష్యం పండితులు శ్రీ పాతూరి సూర్య నారాయణాచార్యులు, విశ్రాంత వారాయిర అధ్యాపకులు శ్రీ విడమర్తి కందాళ రామానుజాచార్యులు ఉన్నారు. భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఈఓ జె. వెంకట్రావు మరియు అర్చక బృందం ఆధ్వర్యంలో వేద మంత్రాల మధ్య స్వామి వారి వార్షిక కళ్యాణానికి నాంది పలికే పందిరి రాట (కళ్యాణ రాట) ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఈ వేడుక భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం స్వామి వారు ఆలయ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు ఉగాది పచ్చడి ప్రసాదంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షణ అధికారులు, దేవస్థాన సిబ్బంది, స్థానిక గ్రామస్తులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమాలు భక్తి, సంప్రదాయం, ఆధ్యాత్మికతల సమ్మేళనంగా నిలిచాయి. స్వామి వారి కళ్యాణ మహోత్సవానికి నాంది పలికిన పందిరి రాట వేడుకలు సింహాచల క్షేత్ర మహిమను మరింత వెలుగులోనికి తెచ్చాయి.





# ఘనంగా కోకాపేటలో ఉగాది వేడుకలు





## విశాఖ శ్రీ శారదా పీఠంలో ఆధ్యాత్మిక వైభవం

### పలువురు ప్రముఖులు హాజరు

**హైదరాబాద్, కోకాపేట,పబ్లిక్ వ్యూ మార్చి 19 :** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కోకాపేటలోని విశాఖ శ్రీ శారదా పీఠంలోని శ్రీ రాజ శ్యామల అమ్మవారి దేవస్థానంలో ఉగాది వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. భక్తిశ్రద్ధలతో నిండిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని ప్రతిబింబించింది. ఉదయం శ్రీ శారదా చంద్ర మౌళీశ్వర ఆరాధనతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం గాయని నిత్య సంతోషిణి బృందం సమర్పించిన భక్తి సంగీత విభావరి భక్తులను ఆధ్యాత్మిక లోకంలోకి తీసుకెళ్లింది. విశాఖ శ్రీ శారదా పీఠం గంటల పంచాంగాన్ని ఘనంగా ఆవిష్కరించారు. పంచాంగ శ్రవణ కార్యక్రమంలో పండితులు నూతన సంవత్సర ఫలితాలను విశదీకరించారు. పీఠాధిపతులు భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తూ, రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలని దేశం శ్రేయస్సు సాధించాలని ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆశీర్వదించారు. ప్రతి కార్యక్రమం దేశ క్షేమం కోసం నిర్వహించబడుతుందని తెలిపారు. భక్తులకు ఉగాది పచ్చడి మరియు మహా ప్రసాదాన్ని పంపిణీ చేశారు. భారీగా తరలివచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

ఈ వేడుకలకు న్యాయమూర్తులు, రాజకీయ నాయకులు, అధికారులు, కళాకారులు సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. వారి పాల్గొనడం కార్యక్రమానికి మరింత ప్రాధాన్యతను తీసుకువచ్చింది. ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తూ, సాంప్రదాయ విలువలను ప్రతిబింబించిన ఈ ఉగాది వేడుకలు విజయవంతంగా ముగిశాయి. నూతన సంవత్సరానికి భక్తులకు ఆధ్యాత్మిక స్ఫూర్తిని అందించడంలో ఈ కార్యక్రమం ముఖ్య పాత్ర పోషించింది.

# సింహాచలం చందనోత్సవం ఏర్పాట్లు పటిష్టం

## భక్తుల సౌకర్యానికి విస్తృత చర్యలు

## విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చీ పరిశీలన





**సింహాచలం,పబ్లిక్ వ్యూ , మార్చు 19 :** శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ఏప్రిల్ 20న జరగనున్న వార్షిక చందనోత్సవం (నిజరూప దర్శనం) సందర్భంగా దేవస్థానం అధికారులు, పోలీస్ శాఖ సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. లక్షలాది మంది భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో భద్రత, రద్దీ నియంత్రణ, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించారు. గురువారం, శంఖబ్రత బాగ్చీ స్వయంగా సింహగిరిపై ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ జల్లేపల్లి వెంకట్రావు, ఇంజినీరింగ్ సిబ్బందితో కలిసి క్యూలైన్లు, హోల్డింగ్ పాయింట్లు, రద్దీ నియంత్రణ చర్యలను సమీక్షించారు.క్యూలైన్లు, రద్దీ నియంత్రణపై దృష్టి భక్తులకు ఇబ్బందులు లేకుండా ఫ్రీ దర్శనం, రూ.100, 300లు ప్రత్యేక దర్శనాల క్యూలైన్లను క్రమబద్ధీకరించాలని సీపీ ఆదేశించారు. గంటల తరబడి నిలబడకుండా ఉండేందుకు వివిధ ప్రాంతాల్లో హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తుల రాకపోకలను సులభతరం చేసేందుకు బస్సులు ఎక్కే, దిగే ప్రాంతాల్లో ప్రత్యేక హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ--పోలీస్ సమన్వయం అవసరమని పేర్కొన్నారు. క్యూలైన్ల వెంట తగినన్ని మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు అందుబాటులో ఉంచాలని అధికారులకు స్పష్టం చేశారు. చెప్పుల స్టాండ్ల వద్ద రద్దీ తగ్గించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, అదనపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఘాట్ రోడ్లు, కొండపైన మరియు కింద పార్కింగ్ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను సక్రమంగా నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. భద్రత కోసం అదనపు పోలీసు బలగాలు మోహరించనున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనలో గోపాలపట్నం సీఐ సన్యాసినాయుడు, ట్రాఫిక్ సీఐ సురేష్, ఎస్ఐ రామారావు మరియు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు. లక్షలాది మంది భక్తులకు స్వామివారి నిజరూప దర్శనం ప్రశాంతంగా, సౌకర్యవంతంగా జరిగేలా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని సీపీ శంఖబ్రత బాగ్చీ స్పష్టం చేశారు.

# గిట్టుబాటు ధర కల్పించి గిరిజనుల వద్దనున్న ఆర్గానిక్ కాఫీని గిరిజన సహకార సంస్థ కొనవాల్సిందే!

## జిసిసి నుండి కాఫీ రుణాలు తీసుకున్న వారి వద్ద మాత్రమే కాకుండా ప్రతి గిరిజన రైతు వద్ద కాఫీ గింజలు జిసిసి కొనుగోలు చేయాలి.

### ఆదివాసి గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి చిరంజీవి.




**చింతపల్లి పబ్లిక్ వ్యూ మార్చి 19.** గిరిజన సహకార సంస్థ (జిసిసి) వద్దనుండి కాఫీ రుణాలు తీసుకున్న రైతుల వద్ద మాత్రమే కాకుండా రుణాలు తీసుకోకపోయినప్పటికీ కాఫీ రైతుల వద్ద ఉన్న కాఫీని గిరిజన సహకార సంస్థ కొనుగోలు చేయాలని ఆదివాసీ గిరిజన మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిసిసి నుండి రుణాలు తీసుకున్న రైతుల కాఫీ గింజలు మాత్రమే జీసి అధికారులు కొనుగోలు చేస్తారా? రుణాలు తీసుకోలేని రైతులకు అన్యాయం చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. గిరిజన రైతులలో ఉన్న ప్రతి ఆర్గానిక్ కాఫీని జిసిసి తప్పనిసరిగా కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిసిసి నుండి రుణాలు తీసుకున్న రైతుల నుంచి మాత్రమే కాఫీలు కొనుగోలు చేయనున్నట్లు డివిజనల్ మేనేజర్ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారని ఈ విషయంపై గిరిజన సంఘం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చింతపల్లి మండలం ఎర్రబొమ్మల పంచాయతీ ఎర్రబందల గ్రామంలో గిరిజన రైతులు జిసిసి కాఫీ గింజలు కొనుగోలు చేయాలని ఆందోళన చేశారని డివిజనల్ మేనేజర్ దీనిపై స్పందించారన్నారు. ఈ తరుణంలో ఈ ఏడాది డివిజన్ పరిధిలో అపెక్స్ కమిటీ నిర్దేశించిన లక్ష్యం మేరకు కాఫీ గింజలను కొనుగోలు చేశామనడం అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. 2016 నుండి 2025 వరకు రైతుకి కనిష్టంగా ఒక ఎకరానికి 10000 గరిష్టంగా 2000 ఎకరాలకు 20,000 ఇచ్చామన్నారు సబ్ డివిజన్ పరిధిలో సుమారు మూడు కోట్ల రుణాలు పెండింగ్లో ఉన్నాయని తాము ఇచ్చిన రుణాల మేరకే కాఫీ గింజలు కొనుగోలు చేస్తామని మిగతా కాఫీ గింజలు కొనుగోలు చేయటం జరగదని కాఫీ రైతులకు చెప్పడం వల్ల తీవ్ర ఆందోళనలు కాఫీ రైతులు ఉన్నారన్నారు. ప్రైవేటు దళారులతో కుమ్మక్కై ఆర్గానిక్ కాఫీ కొనకుండా గిరిజన సహకార సంస్థ నాణ్యతలేని కాఫీ గింజలను కొని జిసిసి అధికారులు జేబులు నింపుకుంటున్నారని దానివల్లే జిసిసి ఖజానా ఖాళీయే గిరిజన సహకార సంస్థకు చెడ్డపేరు తీసుకువస్తున్నారని ఆయన ఆరోపించారు. దీనిపై జిసిసి ఉన్నత అధికారులు నిశితంగా పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఎర్రబొమ్మల పంచాయతీ ఎర్ర బందల గ్రామంలో సుమారు 70 టన్నుల కాఫీ గింజలు ఒకే గ్రామంలో నిలువ ఉన్నాయని అలాగే చింతపల్లి జికె వీధి మండలాలలో అనేక గ్రామంలో కాఫీ గింజలు భారీ ఎత్తున నిల్వలు ఉన్నాయని జిసిసి గిట్టుబాటు ధరకు కొంటుందని నమ్మి రైతులు మోసపోయారని ఆయన ఆరోపించారు. గిరిజన సహకార సంస్థ అధికారులు మాటలు ఎలా నమ్మాలని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా జిసిసి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని కాఫీ రైతుల దగ్గర ఉన్న ఆర్గానిక్ కాఫీని కొనుగోలు చేయాలని ఆయన కోరారు. దేనిపక్షంలో డిఎం కార్యాలయ ముట్టడితోపాటు ఉద్యమాలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# ఉగాది పురస్కారం అందుకున్న నందవరపు సోములు

## ముఖ్యమంత్రి చేతుల మీదుగా సత్కారం

## విజయవాడలో ఘనంగా జరిగిన కార్యక్రమం





**విజయవాడ, పబ్లిక్ వ్యూ , మార్చి 19 :** విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఉగాది పురస్కారాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని పురస్కారాలను అందజేశారు.

**నందవరపు సోములకు రాష్ట్ర గౌరవం..**

గత నాలుగు దశాబ్దాలుగా సమాజ సేవలో విశేష కృషి చేస్తున్న నందవరపు సోములుని ముఖ్యమంత్రి సత్కరించి ఉగాది పురస్కారాన్ని అందజేశారు. ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రతిష్టాత్మక అవార్డుతో గౌరవించింది. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ నందవరపు సోములుని అభినందిస్తూ, సమాజ సేవలో ఆయన చూపుతున్న నిబద్ధత ఆదర్శనీయమని పేర్కొన్నారు.

**నాలుగు దశాబ్దాల సేవా ప్రస్థానం..**

నందవరపు సోములు గారు గత 40 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. పలు సంఘాలను స్థాపించి, వాటిని విజయవంతంగా నడిపిస్తూ ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. సోములు స్థాపించిన ముఖ్య సంస్థలు గోపాలపట్నం కళా సేవ పీఠం, మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్, శ్రీ బాపూజీ వికలాంగుల సంక్షేమ సేవా సంఘం, శ్రీ పద్మనాభ నగర్ గ్రామాభ్యుదయ యువజన సేవా సంఘం,

పలు యువజన సేవా సంఘాలు, మహిళా సేవా సంఘాలు అనేక డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేశారు. సమాజంలోని వివిధ వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న నందవరపు సోములుకి ఈ ఉగాది పురస్కారం రావడం ఆయన సేవలకు రాష్ట్రస్థాయి గుర్తింపుగా నిలిచింది.

# కార్మికులకు తువ్వాళ్ళు, పాదరక్షకులు పంపిణి



**కురుపాం, మార్చి 19పబ్లిక్ వ్యూ :** కురుపాం గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు మరియు కలాసీలకు ఉగాది పండుగ సందర్భంగా తువాళ్లు,పళ్లు, మరియు పాదరక్షలను మాజీ కళింగ వైశ్య డైరెక్టర్ కొత్తకోట వెంకట సురేష్ కుమార్ పంపిణీ చేశారు.ఉగాది పండుగ సందర్భంగా కార్మికులకు వేసవి దృష్ట్యా చెప్పులు, తువ్వాళ్ళు పంపిణి చేయడం తో పారిశుధ్య కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తూ, తమ పట్ల చూపిన గౌరవానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో ఎంపిటిసి స్వామియాజులు, వైస్ సర్పంచ్ షేక్ ఆదిల్ పాల్గొన్నారు.

# ఆయుర్ జీవ ఫౌండేషన్ పిచుకల దినోత్సవం అవగాహన కార్యక్రమం



**అక్కయ్యపాలెం మార్చ్ 19పబ్లిక్ వ్యూ :**ఆయుర్ జీవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం ప్రాంతంలో ప్రపంచ పిచుకల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమాన్ని పిచుకలను రక్షించడం మరియు ప్రకృతిని కాపాడడం అనే లక్ష్యంతో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ధాన్యపు గుట్టలు ఏర్పాటు చేయడం, నీటి పాత్రలు ఉంచడం, పిచుకలకు గూళ్లు కల్పించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అశోక్ బాబు (రిటైర్డ్ ఎస్పీ) విచ్చేసి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ:పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని తెలిపారుపిల్లలకు ప్రకృతి మరియు పక్షులపై అవగాహన కల్పించాలని సూచించారుపిచుకల సంరక్షణకు మనమంతా కృషి చేయాలని పిలుపునిచ్చారుపిచుకలకు నీరు, గూళ్లు అందించాల్సిన అవసరాన్ని వివరించారుఆయుర్ జీవ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శ్రీమతి ఎస్. సుబ్బలక్ష్మి మాట్లాడుతూ:

“ఒక నీటి పాత్ర ఒక పిచుక ప్రాణాన్ని కాపాడుతుంది, ఒక గూడు అనేక పిచుకల పెరుగుదలకు దోహదపడుతుంది” అని తెలిపారు. వేసవికాలంలో పిచుకలు గూళ్లు కట్టుకుని పిల్లలను పెంచుకునేలా సహకరించాలని కోరారు.ఫౌండేషన్ అధ్యక్షులు డా. ఆదిత్య రంగనాథ్ మాట్లాడుతూ:సెల్ టవర్ల రేడియేషన్ వల్ల పక్షులు నష్టపోతున్నాయని తెలిపారుపర్యావరణ పరిరక్షణ కోసం ఎక్కువ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారుఈ కార్యక్రమంలో అశోక్ బాబు, శ్రీనివాస్ రావు, సత్యశ్రీ, డా. ఆదిత్య రంగనాథ్, ఎస్. సుబ్బలక్ష్మి, స్వర్ణకుమారి (స్వచ్ఛత ఫౌండర్) తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వైఎస్సార్‌సీపీ యువజన నేత దొడ్డి కిరణ్ జన్మదిన వేడుకలు





**విశాఖ పశ్చిమ,పబ్లిక్ వ్యూ , మార్చి 19 :** స్థానిక విశాఖ జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జనరల్ సెక్రటరీ దొడ్డి కిరణ్ జన్మదిన వేడుకలు ఉగాది పర్వదినం సందర్భంగా ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆయన నివాసం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో చేరుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఉగాది పర్వదినంతో కలసి రావడంతో వేడుకలకు ప్రత్యేక ఆకర్షణ నెలకొంది. నాయకులు దొడ్డి కిరణ్‌కు శాలువ కప్పి సన్మానం చేసి, కేక్ కట్ చేయించి సంబరాలు జరిపించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు ఆయన సేవలను కొనియాడుతూ, మరిన్ని ఉన్నత స్థాయిలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు మరియు యువజన విభాగ సభ్యులు పాల్గొన్నారు. అందరూ కలిసి ఆనందోత్సాహాల మధ్య కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నాయకులు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రజలందరికీ సుఖశాంతులు కలగాలని కోరుకున్నారు.

# గూడెం కొత్త వీధి-సీలేరు అంతర్రాష్ట్ర రహదారి పనులు త్వరలో పూర్తి చేయండి.

## అధికారులను కోరిన భారతీయ ఆదివాసుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు గడుతూరి రామ గోపాల్.



**చింతపల్లి పబ్లిక్ వ్యూ మార్చి 19.** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం గూడెం కొత్త వీధి నుండి సీలేరు వరకు ఉన్న అంతర్ రాష్ట్ర రహదారి పనులను పూర్తి చేయాలని చింతపల్లి ఏ ఎస్ పి నవజ్యోతి మిశ్రా ను కోరినట్లు భారతీయ ఆదివాసుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ అధ్యక్షు డు రామ్ గోపాల్ గడుతూరి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ తెలుగు సంవత్సరం ఉగాది సందర్భంగా చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా (ఐపీఎస్) కి , అలాగే కోరాపుట్ ఏ ఎస్ పి పార్థ జగదీష్ కశ్యప్ కు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశామన్నారు. ఈ సందర్భంగా చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా కు గూడెం కొత్త వీధి సీలేరు అంతర్ రాష్ట్ర రహదారి పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని , వర్షాకాలం లోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటే బావుంటుందని విన్నవించగా నవజ్యోతి మిశ్రా దీనిపై కూలంకుశంగా స్పందించి అల్లూరి జిల్లా ప్రజలు చాలా మంచి వారని, కల్మషం లేని వారిని ఆయన తెలియజేస్తూ, జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ దృష్టికి తీసుకువెళ్లి ఈ రహదారి పనులు త్వరగా పూర్తి అయ్యే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్పి నవజ్యోతి మిశ్రా కు రామగోపాల్ గడుతూరి కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ శ్రీ శ్రీ పోలమాంబ జాతర గోడపత్రిక ఆవిష్కరణ

## 9 వ వార్డు సంజయ్ గాంధీ కొలువైన గ్రామ దేవత పోలమాంబ వారి జాతర మహోత్సవాలు

### టిడిపి పార్లమెంటరీ ఎస్సీ సెల్ అధ్యక్షులు బుడుమూరి

**విశాఖ తూర్పు, పబ్లిక్ వ్యూ , మార్చి 19:**జీవీఎంసీ, 9వ వార్డు సంజయ్ గాంధీ కాలనీ లో కొలువైవున్న గ్రామ దేవత శ్రీ పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవములు ఈ నెల 21 అమ్మవారి రాట మహోత్సవం తో మొదలుకొని 27 నుండి 31 వరకు అంగరంగ వైభవంగా జరుపుటకు ఆలయ ధర్మకర్త కంచు మూర్తి నాగరాజు , ఆలయ అధ్యక్షులు ఒమ్మిరాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆహ్వానం మేరకు టిడిపి పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షులు, 9వ వార్డు టిడిపి ఇన్చార్జ్ బుడుమూరి గోవింద్ శ్రీ పోలమాంబ అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి జాతర మహోత్సవముల గోడ పత్రికను ఆయన చేతుల మీదగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 గ్రామాల ఆరాధ్య దైవము, సంజయ్ గాంధీ కాలనీ గ్రామ దేవత పండుగను ప్రతి ఏడాది ఘనంగా నిర్వహిస్తారని ఈ ఏడాది అంతకన్నా వైభవంగా జరిపించేందుకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు.

అదేవిధంగా ఈసారి పెదగదిలి, సంజయ్ గాంధీ కాలనీ గ్రామాలు కలుపుకొని పెద్ద ఎత్తున జాతర నిర్వహించేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం ఆలయ అధ్యక్షులు ఒమ్మి రాజు, ప్రధాన కార్యదర్శి కెర్రు తాతారావు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఘనంగా నిర్వహించే జాతర మహోత్సవములు ఈ ఏడాది కూడా అత్యంత వైభవంగా జరిపించాలని మాట్లాడారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా వాలంటరీలను నియమిస్తామని అన్నారు భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఉగాది వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర జానపద కళలు సృజనాత్మకత అకాడమీ చైర్మన్


### డాక్టర్ వంపూరు గంగులయ్య





**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పబ్లిక్ వ్యూ మార్చి 19:**శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గురువారం విజయవాడలోని తుమ్మలపల్లి కళక్షేత్రంలో ఘనంగా నిర్వహించింది. ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య గారు హాజరై కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి పురస్కారాలు ప్రదానం చేశారు. మొత్తం 38 మందికి కళారత్న పురస్కారాలు, 122 మందికి ఇతర విభాగాల్లో పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, దేవాలయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి , ఎంపీ కేశినేని శివనాథ్,ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్ రావు , బోండా ఉమా మహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. ఉగాది వేడుకలు సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, సత్కారాలు ఆకట్టుకున్నాయి.

## యువత ఉత్తమ భవిష్యత్ కు ఏకైక మార్గదర్శి లోకేష్...



**కురుపాం, పబ్లిక్ వ్యూ , మార్చి 19 :** రాష్ట్ర విద్యాశాఖ ,ఐటీ సాంకేతిక మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో యువతకు ఉత్తమ భవిష్యత్ కల్పంచటం జరుగుతోందని యువత ఆనందం వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి ,మాజీ ఎఎంసి చైర్మన్ కోలా రంజిత్ కుమార్ అన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా యువత కు ఉజ్వల భవిష్యత్ కోసం 10060 ఉద్యోగాల జాబ్ క్యాలెండర్ ప్రకటన షెడ్యూల్ విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్య లో పోస్ట్ లు 1500 ఉద్యోగాలు మే .15.2026 ,గ్రూప్1 ఆగస్టు15-91 పోస్ట్ లు ,హోమ్ శాఖలో 2778 పోస్ట్ లు ,ఇతర శాఖ లు98 ఆగస్టు 15 న ఉద్యోగ ప్రకటన విడుదల కానున్నాయని యువత సద్వినియోగం చేసుకొని ఆశక్తి గల రంగంలో ఉద్యోగం పొందాలని సూచించారు. యువత కు 20లక్షల ఉద్యోగాల కల్పించే లక్ష్యం గా కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని అన్నారు. పరిపాలన చేపట్టిన20నెలల లో 628367ఉద్యోగాలు యువత కు కల్పంచటం జరిగిందని ,దీని తో పాటు 23లక్షల కోట్ల పెట్టబడులు వివిధ సంస్థలు స్థాపన ద్వారా 22లక్షల ఉద్యోగావకాశాలు కల్పించటం జరుగుతoందన్నారు. యువత భవిష్యత్ కు ఉత్తమ మార్గదర్శి గా మంత్రి నారా లోకేష్ వ్యవహరిస్తుండటం హర్షనీయం అన్నారు. ఈ కార్యక్రమం లో మండల కన్వీనర్ కె.వి.కొండయ్య ,తెలుగు యువత నాయకులు ఛందక రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు సంస్కృతికి ప్రతీక ఉగాది...

పరాభవ ఉగాది ప్రజలందరికీ మేలు చేకూర్చాలి...
రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావుకు
గండేపల్లి మండల టిడిపి నాయకులు ఉగాది శుభాకాంక్షలు...





**గండేపల్లి పబ్లిక్ వ్యూ , మార్చి 19:** పరాభవ నామ ఉగాది సంవత్సరం తెలుగు ప్రజలు మరీ ముఖ్యంగా గండేపల్లి మండల ప్రజల జీవితాల్లో ఆయురారోగ్యాలు, ఆనందాలు నింపాలని రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, గండేపల్లి మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు ఆకాంక్ష వ్యక్తం చేశారు. గండేపల్లి మండలం సింగరం పాలెం గ్రామం లో గండేపల్లి గ్రామ టిడిపి అధ్యక్షులు బొల్లం రెడ్డి రామకృష్ణ ఆధ్వర్యంలో శ్రీ పరాభవ నామ ఉగాది శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించారు. పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ తెలుగు సంస్కృతికి ప్రతీక ఉగాది అని, వసంత మాసం లో వచ్చే ఈ పండుగకు ప్రకృతి అంతా శోభాయమానంగా ఉంటుందన్నారు. ఈ సంవత్సరంలో అందరికీ మేలు జరగాలన్నారు. ఎన్డీఏ కుటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో అటు రాష్ట్రంలోనూ, ఇటు నియోజకవర్గంలోనూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో నియోజకవర్గాన్ని ప్రగతి పదంలో నడిపిస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కంటిపూడి రామయ్య, బొల్లంరెడ్డి రామకృష్ణ, వెంపాటిరాజు, ఆళ్ల సత్తిబాబు, పైల వెంకన్న, ముంగర సూర్యారావు, వెంపాటి సతీష్, చిటికెల కన్నబాబు, నాలం వీరబాబు, ఉప్పలపాటి సత్తిబాబు, ఉండవిల్లి రాధాకృష్ణ, వెంపాటి రాంబాబు, కంటిపూడి సత్యనారాయణ, చాగంటి కృష్ణమోహన్, బొల్లిన సత్యనారాయణ, గారపాటి రమణ, అంబటి సుబ్బారెడ్డి, నాళం శ్రీను, కొమ్ముకూరి శ్రీను, గుర్రం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## చిల్లంగి శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

### -ఉగాది సందర్భంగా భక్తులతో కిటకిట స్వామివారి ఆలయం



**కిర్లంపూడి, పబ్లిక్ వ్యూ , మార్చి 19:** కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామంలో వేంచేసియున్న శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకంతోపాటు శ్రీ అష్టలక్ష్మి సమేత లక్ష్మీనారాయణ స్వామి వారికి శ్రీ చక్ర కుంకుమార్చనలు భక్తుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. చిల్లంగి గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆరాధ్యుల లక్ష్మీ నరసింహమూర్తి శర్మ, పాండురంగ శర్మ,కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## నవోదయ ఫలితాల్లో ప్రత్తిపాడు శ్రీ లక్ష్మి నవోదయ అండ్ సైనిక్ కోచింగ్ సెంటర్ ప్రభంజనం

### --కోచింగ్ మాస్టర్ అయ్యప్పకు విద్యార్థుల తల్లిదండ్రులు ఘన సన్మానం



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పబ్లిక్ వ్యూ మార్చి 19:** జవహర్ నవోదయ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచి శ్రీ లక్ష్మి నవోదయ అండ్ సైనిక్ ట్యూటోరియల్స్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు 17 మందికి 10 మంది విద్యార్థులు సీట్లు సాధించి అద్భుత ఫలితాలు స్వంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడులో ఉన్న కోచింగ్ సెంటర్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు కోచింగ్ మాస్టర్ ఉగ్గిరాల అయ్యప్పను ఘనంగా సన్మానించారు. ఈ విజయానికి ప్రధాన కారణం అయ్యప్ప మాస్టర్ అందించిన కృషి,మార్గదర్శకత్వం,క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన బోధన అని తల్లిదండ్రులు ప్రశంసించారు. విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తూ,గ్రామీణ ప్రాంతాల పిల్లలకు ఉత్తమ అవకాశాలు కల్పిస్తున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మి నవోదయ అండ్ సైనిక్ ట్యూటోరియల్స్ కోచింగ్ సెంటర్ అధినేత ఉగ్గిరాల అయ్యప్ప మాట్లాడుతూ విద్యార్థుల కష్టంతో పాటు తల్లిదండ్రుల సహకారమే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో ఫస్ట్ ర్యాంక్ సాధించిన మేడిది వర్షిత్ తో పాటు మిస్త్రి వెంకట సీతాలక్ష్మి కావ్య, పసగొడుగుల యశస్విని, షేక్ హనిఫ్, దివిలి కుమార్, మేడిది ప్రిన్సి ప్రహర్షిత, బొడ్డేటి బాల శ్రీ దుర్గ, చిట్టూరి శ్రీ శివ కుశాల్, రేవూరి దొర దుర్గా ఏసుబాబు, సువర్ణం శ్రీ బాలాజీ అవినాష్ లను ఆయన అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయకు 8 మంది,ఎటపాక (భద్రాచలం) నవోదయ విద్యాలయకు ఇద్దరు విద్యార్థులు,మొత్తం 10 మంది మొదటి విడతలో ఎంపికైనట్లు తెలిపారు. రెండో విడతలో కూడా మరి కొంతమందికి వచ్చే అవకాశం ఉన్నట్లు ఆయన మీడియాకు తెలిపారు. అలాగే ఇటీవల విడుదలైన సైనిక్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఆరుగురు అర్హత సాధించినట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి జరగబోయే నవోదయ ఆరో తరగతి ప్రవేశానికి హాస్టల్ సదుపాయంతో పాటు కోచింగ్ ఏప్రిల్ నెలలో ప్రారంభిస్తామని,ఆసక్తిగల తల్లిదండ్రులు తనను సంప్రదించాలని అయ్యప్ప కోరారు.

## ఏ ఎం సి చైర్మన్ మార్ని ఆధ్వర్యం లో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు

### ఉగాది శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం,పబ్లిక్ వ్యూ , మార్చి 19**
తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మార్కెట్ కమిటీ చైర్మన్ మార్ని వాసుదేవ్ ఆధ్వర్యం లో స్వగృహం లో శ్రీ పరాభవ నామసంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి దంపతులు, రాష్ట్ర కార్యదర్శి గోరంట్ల రవి రామ్ కిరణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ హాజరయ్యారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ తెలుగు ప్రజలందరికీ శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. సకాలంలో వర్షాలు కురిసి రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి చెందాలని, సంపద పెరగాలని ఆకాంక్షించారు. రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి శ్రీమతి ఝాన్సీ లక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. నియోజకవర్గంలోని అధికారులను ఉగాది పురస్కారాలతో సత్కరించి, తెలుగు సంస్కృతి సంప్రదాయాలు అద్దం పట్టేలా వాసుదేవరావు కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాంగ శ్రవణం అనంతరం సంప్రదాయ వంటలతో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## కోరుకొండలో భారీగా ఈదురు గాలులు..

### - గాలి బీభత్సవానికి భారీ ఫ్లెక్స్ ధ్వంసం..



**కోరుకొండ, పబ్లిక్ వ్యూ మార్చి 19:** కోరుకొండలో గురువారం సాయంత్రం భారీ ఈదురు గాలులకు భారీ ఫ్లెక్స్ చిరిగిపోయింది. ఈ సందర్భంగా రోడ్డుకి ఇరువైపులా ఉన్న ఫ్లెక్సీలు గాలి బీభత్సవానికి ధ్వంసం అయ్యాయి. ఉగాది సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు హఠాత్తుగా వచ్చిన ఈదురు గాలులు వర్షానికి భారీ ఫ్లెక్సీలు నేలకు ఒరిగాయి. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది కలగలేదు.

# గ్లామర్ టు పవర్ : ఏపీలో పవన్.. తమిళనాడులో విజయ్!



**పబ్లిక్ వ్యూ డెస్క్:** దక్షిణాది రాజకీయాల్లో సినిమా గ్లామర్‌కు, అధికార పీఠానికి విడదీయలేని బంధం ఉంది. గతంలో తమిళనాట ఎంజీఆర్, జయలలిత, కరుణానిధి, ఏపీలో ఎన్టీఆర్ వంటి వారు వెండితెర వేల్పులుగా వెలిగి, అప్రతిహత విజయాలను అందుకున్నారు. అయితే, మారుతున్న కాలంలో ఒక సూపర్ స్టార్ నేరుగా రాజకీయాల్లోకి వచ్చి సక్సెస్ అవ్వడం అంత సులభం కాదని రజనీకాంత్ వెనకడుగు, కమల్ హాసన్ వైఫల్యం నిరూపించాయి. ఈ క్రమంలో ఏపీలో పవన్ కల్యాణ్ సాధించిన అద్భుత విజయం ఇప్పుడు తమిళ నటుడు విజయ్ స్థాపించిన టీవీకే పార్టీకి ఒక ఆశాకిరణంగా కనిపిస్తోందని వ్యాఖ్యానిస్తున్నారు. వచ్చేనెలలో జరగనున్న తమిళనాడు ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా టీవీకే అధినేత విజయ్ పోటీ చేస్తున్నారు. 2024 ఫిబ్రవరి 2న విజయ్ టీవీకే పార్టీని ప్రారంభించారు. అంతకుముందు కొన్నేళ్లుగా ఆయన 'మక్కల్ ఇయక్కం' అనే పేరుతో ఫ్యాన్ క్లబ్స్ నడిపారు. దీనిద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇప్పుడు తన ఫ్యాన్స్ నే పార్టీ కేడర్ గా మార్చుకుని ఎన్నికల రణక్షేత్రంలోకి దిగారు. ఇక పవన్ కూడా 2009 ఎన్నికల్లో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. తొలుత తన సోదరుడు, మెగాస్టార్ చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో యువరాజ్యం సారథిగా పనిచేశారు. 2014లో సొంతంగా జనసేన పార్టీని ప్రారంభించి పదేళ్ల పాటు పోరాడి పార్టీని కీలక స్థాయికి తీసుకువచ్చారు. పవన్ కల్యాణ్ 2014లో జనసేనను స్థాపించినప్పుడు ఎన్నికలలో పోటీకి దూరంగా ఉండిపోయారు. ఇక 2019లో ఆయన స్వయంగా రెండు చోట్ల ఓడిపోయారు. కానీ, పదేళ్ల పాటు క్షేత్రస్థాయిలో పోరాడి ఏపీకి డిప్యూటీ సీఎంగా ఎదిగారు. అంతేకాకుండా వంద శాతం స్ట్రైక్ రేటుతో ఎవరికీ దక్కని విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని, వ్యూహాత్మకంగా అడుగులు వేసి 2024లో విజయం సాధించిన పవన్ కల్యాణ్ తమిళనాట విజయ్ కి ఆదర్శంగా మారారని వ్యాఖ్యానిస్తున్నారు.

2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా రణరంగంలోకి దిగిన విజయ్ అచ్చం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాదిరిగానే అడుగులు వేస్తున్నారని చెబుతున్నారు. తన సినిమా కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉండగానే నటనకు స్వస్తి పలికారు. పూర్తిస్థాయి రాజకీయ నాయకుడిగా మారారు. పవన్ కూడా ఎన్నికలకు ముందు అంగీకరించిన సినిమాలు తప్ప, కొత్తగా మరే సినిమాకు కాల్షీట్లు ఇవ్వలేదని గుర్తు చేస్తున్నారు. అంతేకాకుండా పవన్ మాదిరిగా విజయ్ కూడా కేవలం గ్లామర్‌ను నమ్ముకోకుండా, భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారని చెబుతున్నారు.

**ఇద్దరి మధ్య కనిపిస్తున్న ముఖ్యమైన పోలికలు**

ఇక రెండు రాష్ట్రాల్లో ఇద్దరు నేతల మధ్య అనేక పోలికలు కనిపిస్తున్నాయని చెబుతున్నారు. ప్రధానంగా ఇద్దరికీ యువ శక్తి ఒక ఆశాకిరణంగా కనిపిస్తోందని చెబుతున్నారు. గత ఎన్నికల్లో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెనుక యువత ఒక సైన్యంలా నిలబడ్డారని అంటున్నారు. ఇప్పుడు తమిళనాట విజయ్‌కి కూడా అంతేస్థాయిలో ఫాలోయింగ్ కనిపిస్తోందని చెబుతున్నారు. దీనికి ఆయన సభలకు వస్తున్న జన సందోహమే నిదర్శనమని వ్యాఖ్యానిస్తున్నారు. తన అభిమాన సంఘాలను రాజకీయ విభాగంగా మార్చడంలో ఇప్పటికే విజయ్ సక్సెస్ అయ్యారని చెబుతున్నారు.

**విజయ్ ముందున్న సవాళ్లు**

ఇక పవన్ కల్యాణ్ ఒక బలమైన కూటమిని ఏర్పాటు చేసి ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వకుండా చూశారు. కానీ తమిళనాడులో పరిస్థితి భిన్నంగా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. అక్కడ ఇప్పటికే డీఎంకే, అన్నాడీఎంకే వంటి బలమైన ద్రావిడ పార్టీలు ఉన్నాయి. విజయ్ ఒంటరి పోరు చేస్తారా లేక పవన్ లాగా మిత్రపక్షాలను కలుపుకుపోతారా అనేది ఆయన భవిష్యత్తును నిర్ణయిస్తుందని చెబుతున్నారు. సినిమా గ్లామర్ ఓట్లను తెచ్చిపెట్టొచ్చు కానీ, పవర్ రావాలంటే పవన్ కల్యాణ్ చూపించిన ఓపిక చాలా అవసరమని అంటున్నారు. పవన్ 2014 నుంచి 2024 వరకు ఎలాగైతే అధికారం కోసం నిరీక్షించారో.. విజయ్ కూడా తమిళ రాజకీయాల్లో ఆ స్థాయి నిలకడను ప్రదర్శిస్తే.. పొరుగు రాష్ట్రంలో పవన్ సృష్టించిన ప్రభంజనాన్ని తమిళనాడులో విజయ్ పునరావృతం చేసే అవకాశం ఉందని అంటున్నారు.

# కూటమి వర్సెస్ వైసీపీ : పరాభవ పంచాంగం ఏమి చెప్పింది ?



**పబ్లిక్ వ్యూ డెస్క్:** ఏపీలో అధికార కూటమి విపక్ష వైసీపీల మధ్య రాజకీయ రచ్చ ఒక రేంజిలో సాగుతూనే ఉంటుంది. అది ఏ విషయం అయినా రెండు వైపులా పోటా పోటీగా ఉంటుంది. ఇదిలా ఉంటే కొత్త తెలుగు సంవత్సరాది వచ్చింది. దాని పేరు పరాభవ నామ సంవత్సరం. ఈ ఉగాది వేళ అధికార కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున ఉగాది కార్యక్రమాలను నిర్వహించింది. అదే సమయంలో వైసీపీ కేంద్ర పార్టీ కార్యాలయంలో ఉగాది కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. రెండు చోట్లా పంచాంగ కర్తలు పఠనం చేశారు. అటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం బ్రహ్మాండంగా ముందుకు సాగుతుందని పండితులు చెప్పారు. వైసీపీకి అన్నీ మంచి రోజులే అని తాడేపల్లి పంచాంగం చెప్పుకొచ్చింది.

**కూటమికి విజయం :**

విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగిన ఉగాది వేడుకలలో మాడుగుల నాగఫణి శర్మ పంచాంగ పఠనం చేశారు. శ్రీ పరాభవ నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వానికి విజయం సిద్ధిస్తుందని ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వం సంకల్పించిన ప్రతీదీ ఫలిస్తుందని స్పష్టం చేశారు. తెలుగు వారు ఏ రంగంలో ఉన్నా అగ్రస్థానంలో ఉండాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం నెరవేరుతుందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖ్యంగా ప్రజాహితంతో ముందడుగులు వేస్తాయని వెల్లడించారు. లగ్నాల ప్రకారం ఈ ఏడాది వర్షపాతం బాగానే ఉంటుందని.అందుకే ఉగాదికి ముందుగానే కురిసిన వర్షం దీనికి సూచిక అని తెలిపారు.ప్రత్యేకంగా ఈ ఏడాది సాంస్కృతిక చైతన్యం కలుగుతుందని వివరించారు. అమరావతి విశ్వనగరంగా ఎదుగుతుందని రాష్ట్రానికి ప్రభుత్వానికి ఆర్థిక ప్రగతి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి విఘ్నాలు లేకుండా సుఖ శాంతులతో ఉంటారని వివరించారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు సహా మంత్రులు అంతా ఆనందం వ్యక్తం చేశారు.

**వైసీపీ అనుకూల ఫలితాలు :**

ఇక తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఉగాది ఉత్సవాలలో పంచాంగ శ్రవణం చేసిన భాస్కర సుబ్రమణ్య సిద్ధాంతి వైసీపీకి పరాభవ నామ సంవత్సరంలో అన్నీ మంచి ఫలితాలు ఉంటాయని చెప్పారు. ఈ ఏడాది పార్టీకి మంచి పునాది పడుతుందని ఆయన చెప్పుకొచ్చారు. చిన్న ప్రయత్నం చేసినా పెద్ద ఫలితాలే వస్తాయని జోస్యం చెప్పారు. పార్టీకి ఈ ఏడాది బలమైన పునాది పడుతుందని కూడా ఆయన వెల్లడించారు. దీంతో వైసీపీ నేతలలో జోష్ అయితే పెద్ద ఎత్తున కనిపిస్తుంది. మొత్తానికి పోటా పోటీగా జరిగిన కూటమి వర్సెస్ వైసీపీ పంచాంగాలు రెండు చోట్లా ఆనందం కలిగించే విధంగా జోస్యాలు వెలువడడం విశేషం.

# రికార్డు క్రియేట్ చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి



**పబ్లిక్ వ్యూ డెస్క్:** ముఖ్యమంత్రి సహాయ నిధి అంటే ఏ సహాయం లేనపుడు ఏ అసరా దొరకనపుడు పేదవాడు తక్కున తలుపు తట్టి కోరేది. ప్రజా ప్రతినిధుల ద్వారా అయినా లేదా అధికారుల తరఫున అయినా విన్నపం పెట్టుకుంటే ముఖ్యమంత్రి వద్ద ఉన్న సహాయ నిధి నుంచి వారికి సత్వరమే ఆర్థిక సాయం దక్కుతుంది. ఆ విధంగా ప్రతీ ప్రభుత్వంలో జరుగుతుంది. అయితే ఎక్కువ సాయం అందాలన్నా వేగంగా ఫైల్స్ కదిలి ఆపన్నులకు అవి చేరాలన్నా సీఎం ఆఫీసులోనూ ఆ ఉదారత కనిపించాలి. ఆ విధంగా చూస్తే చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ 21 నెలల కాలంలో రికార్డు స్థాయిలో పేదలను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సహాయం లభించింది అని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

**ఉగాది వేళ తొలి సంతకం :**

పేదలకు పెద్దపీట వేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం పక్షాన ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉగాది వేళ లికొత్త తెలుగు సంవత్సరంలో తొలి రోజున పేదల సంక్షేమం అయిన ముఖ్యమంత్రి సహాయ నిధి దస్త్రంపై తొలి సంతకం పెట్టడం విశేషం. ఆ విధంగా కూటమి ప్రభుత్వం పేదల పట్ల తన నిబద్ధత చాటుకుంది అని చెప్పాల్సిందే. ఏకంగా రూ.55.63 కోట్ల సీఎంఆర్ఎఫ్ నిధుల విడుదల దస్త్రంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సంతకం చేయడం విశేషం. దీని ద్వారా 6,787 మంది పేదలకు లబ్ధి కలుగుతుందని అధికారులు చెబుతున్నారు.

**సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.1,241 కోట్ల సాయం :**

ఇదిలా ఉంటే గడచిన 21 నెలల కూటమి ప్రభుత్వం హయాంలో ఏకంగా సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.1,241 కోట్ల ఆర్థిక సాయం అందించినట్లుగా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ విధంగా సాయం చేయడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ఈ సాయం ఎంతో ఉపశమనం కలిగిస్తున్నాయి. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఫైనాన్సియల్ అసిస్టెన్స్, వైద్య సహాయం, ఎల్ఓసిల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,36,240 మంది పేదలకు లబ్ధి చేకూరింది. ఇక వివరాల్లోకి వెళ్తే 2024లో 15,206 మందికి రూ.184 కోట్లు, 2025లో 1,03,568 మందికి రూ.889 కోట్లు, 2026లో ఇప్పటి వరకు 17,466 మందికి రూ.169 కోట్లతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కూటమి ప్రభుత్వం సాయం చేసింది.

**మంచి కార్యక్రమం ద్వారా :**

ఇక ఇక తెలుగు నూతన సంవత్సరం తొలి రోజన పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి సంతకం చేశారు. ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ, పేదల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు వారి వైద్యపరమైన అవసరాల నిమిత్తం నిధులకు లోటు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ విధంగా అందిన ఆర్థిక సాయంతో వైద్యం చేయించుకుని లక్షలాది మంది అరోగ్యవంతులు అవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అయితే ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పేదలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి సహాయ నిధితో ఆదుకుంటోంది.

# భారత ఇంధన భద్రతకు ముంచుకొస్తున్న ముప్పు



**పబ్లిక్ వ్యూ డెస్క్:** పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు భారత ఆర్థిక వ్యవస్థకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇరాన్ , దాని ప్రత్యర్థి దేశాల మధ్య కొనసాగుతున్న దాడులు, ప్రతిదాడులు ఇప్పుడు ప్రపంచ ఇంధన సరఫరా కేంద్రాలపై పడ్డాయి. ముఖ్యంగా ఖతర్‌లోని రాస్ లఫన్ ఎల్ఎన్‌జీ కేంద్రం, సౌదీ అరేబియాలోని అరామ్‌కో రిఫైనరీలపై జరిగిన తాజా దాడులు భారత్‌కు పెను సవాలుగా మారనున్నాయి. ఈ పరిణామాలు భారత ఇంధన భద్రతను, పారిశ్రామిక వృద్ధికి ముప్పుగా చెప్పొచ్చు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కేవలం సరిహద్దు పోరాటాలకే పరిమితం కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటి ఇంధన మౌలిక సదుపాయాలపైకి మళ్లడం ఆందోళన కలిగిస్తోంది. ఇరాన్ చేపట్టిన తాజా డ్రోన్ , క్షిపణి దాడులు ప్రపంచంలోనే అతిపెద్ద సహజ వాయువు, చమురు ఉత్పత్తి కేంద్రాలను లక్ష్యంగా చేసుకోవడం భారత్‌ను ఆత్మరక్షణలో పడేసింది.

**ఖతర్ ఎల్ఎన్‌జీ సంక్షోభం: భారత్‌పై నేరుగా ప్రభావం**

భారతదేశం తన మొత్తం సహజ వాయువు అవసరాలలో సుమారు 50 శాతం విదేశీ దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇందులో సింహభాగం అంటే దాదాపు 40 శాతం ఒక్క ఖతర్ నుంచే వస్తుంది. తాజాగా ఖతర్‌లోని ప్రపంచ ప్రసిద్ధ రాస్ లఫన్ ఎల్ఎన్‌జీ హబ్‌పై జరిగిన దాడి భారత గ్యాస్ సరఫరా గొలుసును ఛిన్నాభిన్నం చేసేలా ఉంది. రాస్ లఫన్ నుండి సరఫరా నిలిచిపోతే భారత్‌లోని గ్యాస్ ఆధారిత విద్యుత్ ప్లాంట్లు, ఎరువుల తయారీ యూనిట్లు , సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయి. అంతర్జాతీయ మార్కెట్లో గ్యాస్ లభ్యత తగ్గడంతో ధరలు ఆకాశాన్ని తాకడం ఖాయం. ఇది దిగుమతి వ్యయాన్ని పెంచి, దేశీయంగా ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది.

**అరామ్‌కోపై దాడి: చమురు మార్కెట్‌లో ప్రకంపనలు**

సౌదీ అరేబియాకు చెందిన అరామ్‌కో రిఫైనరీపై జరిగిన దాడి ప్రపంచ చమురు మార్కెట్లను కుదిపేసింది. సౌదీ అరేబియా భారత్‌కు రెండో అతిపెద్ద చమురు సరఫరాదారు. అక్కడి ఉత్పత్తిలో ఏ చిన్న అంతరాయం కలిగినా అది భారత పెట్రోల్, డీజిల్ ధరలపై తక్షణ ప్రభావం చూపుతుంది. గతంలో కూడా అరామ్‌కోపై దాడులు జరిగినప్పుడు అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ ధర ఒక్కసారిగా పెరిగిన ఉదంతాలు ఉన్నాయి.

**ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావం**

ఇంధన ధరల పెరుగుదల కేవలం వాహనదారులకే కాకుండా మొత్తం ఆర్థిక వ్యవస్థపై గొలుసుకట్టు ప్రభావాన్ని చూపుతుంది. గ్యాస్ ధరలు పెరిగితే విద్యుత్ ఉత్పత్తి వ్యయం పెరిగి, సామాన్యులపై భారం పడుతుంది. ఎరువుల తయారీలో సహజ వాయువు ప్రధాన ముడిసరుకు. సరఫరా తగ్గితే ఎరువుల కొరత లేదా ధరల పెరుగుదల వల్ల రైతులకు కష్టాలు తప్పవు. స్టీల్, గ్లాస్, సిరామిక్ వంటి పరిశ్రమలు గ్యాస్‌పైనే ఆధారపడతాయి. ఉత్పత్తి వ్యయం పెరగడం వల్ల భారత ఉత్పత్తుల పోటీతత్వం తగ్గుతుంది. ఇరాన్ ఈ దాడులను "సౌత్ పార్స్" గ్యాస్ ఫీల్డ్‌పై జరిగిన దాడులకు ప్రతిచర్యగా పేర్కొంటోంది. ఈ ప్రతీకార దాడుల పరంపర గల్ఫ్ ప్రాంతాన్ని అస్థిరతలోకి నెట్టివేస్తోంది.

**భారత్ ముందున్న మార్గాలు ఏమిటి?**

ప్రస్తుత సంక్షోభాన్ని తట్టుకోవడానికి భారత్ కేవలం నిరసనలతో సరిపెట్టకుండా ఆచరణాత్మక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. కేవలం పశ్చిమాసియాపైనే కాకుండా అమెరికా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా దేశాల నుంచి ఎల్ఎన్‌జీ దిగుమతులను పెంచుకోవాలి. దేశంలో ఉన్న భూగర్భ చమురు నిల్వలను అత్యవసర సమయాల కోసం సిద్ధంగా ఉంచుకోవాలి. సోలార్, విండ్ పవర్ వంటి రంగాల్లో పెట్టుబడులను వేగవంతం చేయడం ద్వారా శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలి. పశ్చిమాసియా దేశాలతో చర్చలు జరిపి, సరఫరాలో అంతరాయం కలగకుండా దౌత్యపరమైన ఒత్తిడి తీసుకురావాలి.

పశ్చిమాసియాలో రేగిన ఈ చిచ్చు ప్రపంచ శాంతికే కాక, భారత ఆర్థిక సుస్థిరతకు కూడా సవాలుగా మారింది. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్ కదలికలను బట్టి భారత్ తన ఇంధన వ్యూహాన్ని యుద్ధ ప్రాతిపదికన మార్చుకోవాల్సి ఉంటుంది.

# బెంగాల్ లో బీజేపీ 10 ఏళ్ల పోరాటం.. 2016లో మూడు సీట్లు.. 2026లో...??



**పబ్లిక్ వ్యూ డెస్క్:** పశ్చిమ బెంగాల్ లో అధికారం దక్కించుకోడానికి ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని బీజేపీ 10 ఏళ్ళుగా పోరాడుతోంది. 2016 నుంచి ఇప్పటివరకు ఆ రాష్ట్రంలో బలపడేందుకు బీజేపీ చేయని ప్రయత్నం లేదని చెబుతున్నారు. పదేళ్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 3 సీట్లు గెలుచుకున్న బీజేపీ.. ఐదేళ్ల తర్వాత జరిగిన ఎన్నికల నాటికి 77 సీట్లకు ఎగబాకింది. ఈ సారి ఏకంగా అధికారంపైనే గురిపెట్టి మడమ తిప్పని పోరాటం చేస్తోంది. అయితే మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి, నాలుగోసారి కూడా ముఖ్యమంత్రి పీఠం అధిష్టించాలని భావిస్తున్న ఫైర్ బ్రాండ్ దీదీ మమతా బెనర్జీని ఎదుర్కొని కమలం జెండా ఎగురవేయడం సాధ్యమా? అన్నదే ఆసక్తికర చర్చగా మారింది. 2014లో కేంద్రంలో అధికారం చేపట్టిన తర్వాత బీజేపీ దేశవ్యాప్తంగా జైత్రయాత్ర కొనసాగిస్తోంది. దేశంలోని నలు దిక్కులా ఆ పార్టీ విస్తరించింది. ఈశాన్య రాష్ట్రాలలోనూ బీజేపీ పాగా వేసింది. ప్రస్తుతం బీజేపీ దేశంలో మొత్తం 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అధికారంలో ఉంది. ఇప్పటివరకు బీజేపీకి చిక్కని బెంగాల్ లో ఈ సారి మ్యాజిక్ చేస్తామని కమల నాథులు చెబుతున్నారు. గత ఎన్నికల ముందు తృణమూల్ కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వచ్చిన సువేంధు అధికారికి పార్టీ పగ్గాలు అప్పగించిన బీజేపీ గెలుపు పక్కా అంటూ భీకర ప్రతిజజలు చేస్తోంది. దీంతో పశ్చిమబెంగాల్ ఎన్నికలు తీవ్ర ఉత్కంఠకు గురిచేస్తున్నాయి.పదిహేనేళ్ల క్రితం వామపక్షాల కోటను తృణమూల్ కూల్చినట్లే.. ఇప్పుడు దీదీ మమతాను గద్దె దించుతామని కమలనాథులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో గెలుపు కోసం పక్కా ప్లాన్ తో ముందుకు కదులుతున్నారు. వరుసగా మూడు దఫాలుగా అధికారంలో ఉన్న తృణమూల్ పై బెంగాల్ లో ప్రజా వ్యతిరేకత ఉందని బీజేపీ చెబుతోంది. సీఎం మమతా బెనర్జీ విధానాలు, ముస్లిం బుజ్జగింపు ధోరణులు, బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన ప్రజలు, హిందూ ఓటర్లను సంఘటితం చేయడంపై బీజేపీ ఫోకస్ చేసిందని చెబుతున్నారు. ఇదే సమయంలో ఇటీవల విడుదలైన ఓపీనియన్ పోల్స్ కూడా బీజేపీ నేతలను ఉత్సాహ పరుస్తోందని అంటున్నారు.గతంలో బీజేపీ సాధించిన 77 సీట్ల కంటే ఈ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలుచుకునే అవకాశాలు ఉన్నాయని పలు సంస్థలు నిర్వహించిన సర్వే ఫలితాలు వెల్లడిస్తున్నాయని చెబుతున్నారు. అయితే ఈ ఫలితాలు తృణమూల్ ను గద్దె దించే అంత స్థాయికి బీజేపీ ఇంకా చేరలేదని చెబుతున్నా, ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నందున ఈలోగా మ్యాజిక్ చేస్తామని బీజేపీ ధీమా వ్యక్తం చేస్తోంది.

పక్కా వ్యూహంతో బెంగాల్ కోటను బద్దలు కట్టేలా ముందుకు కదులుతోందని అంటున్నారు. తృణమూల్ ఓటు బ్యాంకును చీల్చడం, బీజేపీ ఓటు బ్యాంకును పెంచడం అన్న లక్ష్యంతో కమల నాథులు వ్యూహాలు రచిస్తున్నారని చెబుతున్నారు మత్స్యకారులు, రైతులను తన వైపు తిప్పుకునేలా తీర ప్రాంత ఓటు బ్యాంకును స్థిరపరుచుకోవడమే ఇందుకు కారణంగా చూపుతున్నారు. బీజేపీ నేత సువేంధు అధికారి కుటుంబానికి కోస్తా ప్రాంతమైన పర్బా మేదినపూర్ లో మంచి బలం ఉంది. 2021 ఎన్నికల్లో ఇక్కడ కేవలం 7 జిల్లాల్లో బీజేపీ గెలిస్తే, 2024 లోక్ సభ ఎన్నికల్లో ఆ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాలలో మెజార్టీ సాధించింది. దీనిని బట్టి బీజేపీ ఒక్కో జిల్లాలో తన ప్రాబల్యం పెంచుకునేలా పనిచేస్తోందని అంటున్నారు. ఝార్గ్రాం, బంకురా, పురూలియా జిల్లాలతో కూడిన గిరిజన బెల్ట్ తోపాటు ఉత్తర బెంగాల్ మైదాన ప్రాంతాల్లో బీజేపీ విస్తరిస్తోందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు గత ఎన్నికల్లో 5 శాతం కంటే తక్కువ మార్జిన్ తో గెలిచిన 46 స్థానాలపై ఈ సారి ప్రత్యేక దృష్టి పెట్టారు.



శృతి హాసన్ యొక్క భీకరమైన బ్రౌన్ గౌన్ గ్లో: బ్యాక్ ఇన్ యాక్షన్

# మొత్తానికి సమంతకు ఆ ఛాన్స్ సమీపిస్తోందా?



దక్షిణాదిలో స్టార్ హీరోయిన్‌గా తనదైన ముద్ర వేసిన సమంత బాలీవుడ్ వెండితెర ఎంట్రీ కోసం గత కొంతకాలంగా ఎదురు చూస్తోన్న సంగతి తెలిసిందే. ది ఫ్యామిలీ మ్యాన్ 2, సిటాడెల్: హనీ బన్నీ వంటి వెబ్ సిరీస్‌లతో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై సత్తా చాటినా? అది బుల్లి తెర కావడంతో? అమ్మడు సంతృప్తి చెందలేదు . ఒక భారీ హిందీ సినిమా ద్వారా థియేటర్లలో ప్రేక్షకులను పలకరించాలనే ప్రయత్నాలు చేస్తున్నా? సరైన ఛాన్సులు రాకపోవడంతో నీరిక్షణ తప్పలేదు. తాజాగా సామ్ వెండి తెర ఎంట్రీకి సమయం ఆసన్నమైంది. బాలీవుడ్ అగ్ర నిర్మాత కరణ్ జోహార్ నిర్మాణంలో సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా రూపొందున్న కొత్త సినిమాలో సమంతను హీరోయిన్‌గా పరిశీలిస్తున్నట్లు తెలిసింది.గుంజన్ సక్సేనా: ది కార్గిల్ గర్ల్, మిస్టర్ అండ్ మిసెస్ మాహి వంటి చిత్రాలతో దర్శకుడిగా తన ప్రతిభను చాటుకున్న శరణ్ శర్మ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. కరణ్ జోహార్‌కు సమంతతో ఉన్న స్నేహం కారణంగా ఈ ఛాన్స్ దక్కుతున్నట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి. మరికొన్ని రోజుల్లోనే ఛాన్స్ ఫైనల్ కానుందని సమాచారం. అదే నిజమైతే సమంత ఆనందానికి అవధులుండవ్. సమంత హిందీ సినిమాల్లో నటించాలని చాలా కాలంగా ఎదురు చూస్తోంది. మధ్యలో అనారోగ్య సమస్యలు , వ్యక్తిగత కారణాల వల్ల కొన్నాళ్లు విరామం తీసుకున్నప్పటికీ, ఆమె క్రేజ్ మాత్రం తగ్గలేదు.ఇటీవలే బాలీవుడ్ దర్శక, నిర్మాత రాజ్ నిడిమోరును వివాహం చేసుకోవడం అమ్మడికి కెరీర్ పరంగానూ కొంత కలిసొచ్చిందని చెప్పొచ్చు. భర్త వైపు నుంచి కూడా కొత్త అవకాశాలు రావడానికి ఛాన్స్ ఉంది. ఇప్పటికే ముంబైలో ఖరీదైన ఇంటిని కూడా కొనుగోలు చేసిన సమంత మకాంను పూర్తిగా బాలీవుడ్‌కు మార్చే సింది. సిద్ధార్థ్ మల్హోత్రా వంటి హ్యాండ్సమ్ హీరో సరసన ఆమె జోడీ కడితే బాలీవుడ్‌లో ఒక ఫ్రెష్ అండ్ క్రేజీ కాంబినేషన్ అవుతుంద నడంలో ఎలాంటి సందేహం లేదు. శరణ్ శర్మ చిత్రాలు భావోద్వేగాలతో కూడిన కథాంశంతో ఉంటాయి. దీంతో సమంత లాంచింగ్ ఇదే పర్ఫెక్ట్ స్టోరీ అవుతుందని అభిమానులు భావిస్తున్నారు. ఇప్పటికే హిందీ భాషపై అమ్మడు పట్టు సాధించింది. అక్కడి ప్రేక్షకులకు నటనతో మరింత దగ్గరవ్వాలని ఆశపడుతోంది. ధర్మ ప్రొడక్షన్స్ లాంటి పెద్ద బ్యానర్ లో లాంచ్ అయితే? వచ్చే గుర్తింపు కూడా ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. హబ్బీ రాజ్ నిడిమోరు సహకారం కూడా అన్ని రకాలుగా దక్కుతుంది. ఇకపై భర్త దర్శకత్వంలో కూడా సినిమాలు చేయడానికి ఛాన్స్ ఉంటుంది. బాలీవుడ్ లో రాజ్ కున్న పరిచయాలతో మరిన్ని అవకాశాలకు ఛాన్స్ ఉంటుంది. మొత్తానికి సమంత బాలీవుడ్ ఎంట్రీ ఆలస్యమైనా? స్ట్రాంగ్ గానే కనిపిస్తుందని చెప్పొచ్చు.



మీనాక్షి చౌదరి బ్లాక్ టాప్ మరియు డెనిమ్ లుక్‌లో హల్ చల్ చేస్తుంది

## చెన్నై సూపర్ కింగ్స్ వైస్ కెప్టెన్ గా

# సంజు శాంసన్!





**పబ్లిక్ వ్యూ డెస్క్:** ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో నాయకత్వ బాధ్యతలు మారే అవకాశం ఉందని మాజీ భారత క్రికెటర్ అనిల్ కుంబ్లే అభిప్రాయం వ్యక్తం చేశారు. రాజస్థాన్ రాయల్స్ జట్టు నుంచి ట్రేడ్ డీల్‌లో భాగంగా సీఎస్‌కేలోకి సంజు శాంసన్ వచ్చాడు. అతడి రాకతో సీఎస్‌కే జట్టు నిర్మాణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. అతనిని నేరుగా లీడర్‌షిప్ గ్రూప్‌లో చేర్చే అవకాశం ఉందని కుంబ్లే పేర్కొన్నారు. జియో హాట్‌స్టార్‌లో ప్రసారమైన "గేమ్ ప్లాన్ -- నో యువర్ టీమ్" కార్యక్రమంలో కుంబ్లే మాట్లాడుతూ.. సంజుకు వైస్ కెప్టెన్ బాధ్యతలు ఇవ్వడం సరైన నిర్ణయం అన్నారు. ఆ పాత్రకి సరైన న్యాయం చేస్తాడని చెప్పారు. రాజస్థాన్ జట్టుకు అతను చాలా కాలం కెప్టెన్‌గా వ్యవహరించాడు. అందుకే నాయకత్వ బాధ్యతలు అతనికి కొత్తేమి కాదని అనిల్ కుంబ్లే అన్నారు.సంజు శాంసన్ ఇప్పటికే ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ఎన్నో సీజన్ల పాటు కెప్టెన్‌గా పని చేసిన అనుభవం ఉంది. చెన్నై సూపర్ కింగ్స్ జట్టు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు డిప్యూటీగా, అలాగే ఎంఎస్ ధోనీ పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించే అవకాశం కనిపిస్తుందని అనిల్ కుంబ్లే వెల్లడించారు. గత ఐపీఎల్ 2025 సీజన్‌లో గైక్వాడ్ గాయం కారణంగా ఎక్కువ మ్యాచ్‌లు ఆడలేకపోయాడు. దీంతో జట్టు నాయకత్వ బాధ్యతలు మళ్లీ ధోనీకి అప్పగించాల్సి వచ్చింది. ఆ సీజన్‌లో సీఎస్‌కే చరిత్రలో తొలిసారి పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలిచింది. కానీ ఈసారి ఐపీఎల్ 2026లో బలంగా పునరాగమనం చేయాలని సీఎస్‌కే లక్ష్యంగా పెట్టుకుంది. ఆరో టైటిల్ గెలవాలనే ఆశయంతో జట్టు సన్నద్ధమవుతోందన్నారు.

**సీఎస్కే స్క్వాడ్ 2026:**

**బ్యాటర్లు:** రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), ఎంఎస్ ధోనీ (వికెట్ కీపర్), సంజు శాంసన్ (వికెట్ కీపర్), దేవాల్డ్ బ్రేవిస్, అయుష్ మత్రే, కార్తిక్ శర్మ, సర్ఫరాజ్ ఖాన్, ఉర్విల్ పటేల్ (వికెట్ కీపర్)

**ఆల్‌రౌండర్లు:** అన్షుల్ కాంబోజ్, జేమీ ఓవర్టన్, రామకృష్ణ ఘోష్, ప్రశాంత్ వీర్, మ్యాథ్యూ షార్ట్, అమన్ ఖాన్, జాక్ ఫౌల్క్స్, శివం దూబే

**బౌలర్లు:** ఖలీల్ అహ్మద్, నూర్ అహ్మద్, ముఖేష్ చౌదరి, నాథన్ ఎల్లిస్, శ్రేయస్ గోపాల్, గుర్జప్నీత్ సింగ్, అకీల్ హోసైన్, మ్యాట్ హెన్రీ, రాహుల్ చాహర్

## సంజుతో ఎవరిని పోల్చలేం.. రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్



**పబ్లిక్ వ్యూ డెస్క్:** మార్చి 28న ప్రారంభమయ్యే ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ కోసం అన్ని జట్లు సిద్ధమవుతున్నాయి. రాజస్థాన్ రాయల్స్ సైతం తీవ్రంగా కసరత్తు చేస్తుంది. ఈసారి ట్రోఫీనే టార్గెట్ గా బరిలోకి దిగుతుంది ఈ టీమ్. రాజస్థాన్ కి చాలా కాలం పాటు ఆడిన సంజు శాంసన్ చెన్నై సూపర్ కింగ్స్ కు ట్రేడింగ్ కావడంతో పాటు సీఎస్కే నుంచి సామ్ కరాన్, రవీంద్ర జడేజాలు వచ్చారు. ఈ సందర్భంగా రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ మీడియాతో మాట్లాడుతూ.. "సంజు శాంసన్ ఆట ప్రత్యేకం, అతడితో ఎవరితో పోల్చలేమన్నారు. ప్రతి ఆటగాడు గెలిచేందుకు ఆడతాడని పేర్కొన్నారు. ఇక గత సీజన్లో చివరి దశలో మేము కొంచెం స్వేచ్ఛగా ఆడి ఉంటే, కచ్చితంగా టోర్నీలో మరింత ముందుకు వెళ్లే వాళ్లం.. ఈసారి ఆ తప్పులను సరిదిద్దుకుంటున్నామని పరాగ్ వెల్లడించారు. టీమ్ లో స్పిన్, ఫాస్ట్ బౌలర్ల సమతుల్యత ఉంది.. బ్యాటింగ్‌లో రైట్-హ్యాండ్, లెఫ్ట్-హ్యాండ్ బ్యాట్స్‌ల సమతుల్యత ఉండటంతో ఈసారి మా దగ్గర స్ట్రాంగ్ బ్యాటింగ్ లైన్ ఉందని రియాన్ పరాగ్ చెప్పారు. రవీంద్ర జడేజాపై జట్టు భారీ ఆశలు పెట్టుకుంది.. హోమ్ గ్రౌండ్‌లో ఆడడంపై ఎక్కువ ప్రభావం ఉండదన్నారు. స్టేడియం ఏదైనా ఈసారి దుమ్మురేపి మాత్రం రాజస్థాన్ రాయల్స్ జట్టే అని ధీమా వ్యక్తం చేశారు. కొంతమంది అభిమానులు చీర్ చేస్తారు, మరీ కొందరు ప్రత్యర్థులను గేలి చేస్తారు.. కానీ మేము డిస్ట్రాక్షన్స్ నుంచి దూరంగా, మా ఆటపై దృష్టి పెడతామని తెలిపారు. మా లక్ష్యం ఒక్కటే ఈ టోర్నీలో బలమైన ప్రదర్శన ఇవ్వడమేనని పరాగ్ పేర్కొన్నారు. జడేజా అద్భుతమైన ఆల్‌రౌండర్, ఆయనపై జట్టు ఎక్కువ ఆశలు పెట్టుకుందని రియాన్ పరాగ్ అన్నారు. మ్యాచ్ పరిస్థితుల ప్రకారం, కష్ట సమయాల్లో వీటిని వ్యూహాత్మకంగా ముందుకు సాగుతామన్నారు. వైభవ్ సూర్యవంశీపై హెడ్ కోచ్ కుమార్ సంగక్కారా విశ్వాసం పెట్టుకున్నారు.. అతను యంగ్ క్రికెటర్ జస్ట్ 15, -16 ఏళ్లలోనూ అద్భుతమైన ఫామ్ కనబరుస్తున్నాడు.. అతని కోసం ప్రత్యేక వ్యూహం రూపొందించామని చెప్పారు. ఇప్పటికే జట్టు ప్రిపరేషన్లు పూర్తి చేసింది.. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో ప్రతి అంశంపై దృష్టి పెట్టాం.. ప్రతీ రోజు బాగా ప్రదర్శించాలని ప్రయత్నిస్తున్నామని రియాన్ చెప్పారు.

**IPLలో రాజస్థాన్ రాయల్స్ స్క్వాడ్:**

రవీంద్ర జడేజా, సామ్ కరాన్, డొనోవన్ ఫెరేరా, సందీప్ శర్మ, శుభం డుబే, వైభవ్ సూర్యవంశీ, లుహాంద్రే ప్రిటోరియస్, షిమ్రాన్ హెట్మైయర్, యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, రియాన్ పరాగ్, యుధ్వీర్ సింగ్ చారక్, జోఫ్రాండ్ మాతృమూర్తి, జోఫ్రాండ్ ఆర్చాండ్, తుషార్నా రవి బిష్ణోయి, సుశాంత్ మిశ్రా, యష్ రాజ్ పుంజా, విఘ్నేష్ పుతూర్, రవి సింగ్, అమన్ రావ్, బ్రిజేష్ శర్మ, ఆడమ్ మిల్న్, కుల్దీప్ సేన్.

## అయ్యో కేకేఆర్‌కు వరుస ఎదురుదెబ్బలు.. రూ. 18 కోట్లు పెట్టిన ఫలితం శూన్యం!



**పబ్లిక్ వ్యూ డెస్క్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2026 ఆరంభానికి ముందే కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుకి వరుస షాక్స్ తగిలాయి. భారత్- బంగ్లాదేశ్ మధ్య ఉద్రిక్తతలతో ఢాకా పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్ ని కేకేఆర్ జట్టు నుంచి తప్పించింది. ఇక టీమిండియా స్టార్ పేసర్ హర్షిత్ రాణా గాయంతో ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యే ఛాన్స్ కనిపిస్తుంది. పేస్ దళాన్ని పటిష్టం చేసే క్రమంలో శ్రీలంక బౌలర్ మతీశ పతిరణని తుది జట్టులోకి తీసుకుంటే ఇప్పుడు ఆడటంపై కూడా అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.వరల్డ్ కప్ టోర్నమెంట్లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్ లో గాయపడిన పతిరణ.. టోర్నీకి దూరమయ్యాడు. దీంతో ఇటీవలే అతడు ఫిట్నెస్ సాధించినట్లు తెలుస్తుంది. కానీ శ్రీలంక క్రికెట్ బోర్డు మాత్రం ఐపీఎల్లో ఆడేందుకు మతీశకు నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) ఇచ్చేందుకు జాప్యం చేస్తున్నట్లు సమాచారం. పతిరణ ఫిట్నెస్ పై తమకు సంతృప్తికరమైన సమాచారం వచ్చినపుడే చీూజ ఇవ్వాలని చూస్తున్నట్లు లంక బోర్డు భావిస్తుంది. ఈ విషయంపై కేకేఆర్ ూాజ బోర్డుతో పతిరణ ఎప్పుడు అందుబాటులోకి వస్తాడనే అంశంపై చర్చిస్తుంది. శ్రీలంక క్రికెట్ బోర్డుతో సంప్రదింపులు చేస్తున్నాం.. ప్రతి రోజు పతిరణ కోసం ఫ్లైట్ టికెట్స్ బుక్ చేయడం, రద్దు చేయడం జరుగుతోందని కేకేఆర్ యాజమాన్యం పేర్కొనింది. కాగా చెన్నై సూపర్ కింగ్స్ తరఫున 2022లో ఐపీఎల్లోకి వచ్చిన అతడు.. మహేంద్ర సింగ్ ధోని ప్రియ శిష్యుడిగా కొనసాగుతున్నాడు. ఇప్పటి వరకు 32 ఐపీఎల్ మ్యాచ్లు ఆడిన మతీశ పతిరణ.. 47 వికెట్లు పడగొట్టాడు. 2026 వేలానికి ముందు చెన్నై అతడిని విడిచి పెట్టగా.. కేకేఆర్ రూ. 18 కోట్లకు దక్కించుకుంది. ఓవైపు హర్షిత్ రాణా జట్టుకు దూరమవడం.. పతిరణ విషయంలోనూ సస్పెన్స్ కేకేఆర్ కి పెద్ద తలనొప్పిగా మారింది. మరోవైపు, పతిరణ మేనేజర్ మాత్రం త్వరలోనే అతడు అందుబాటులోకి వస్తాడనేలా సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తుంది.

On behalf of Published and owned by CHIRIKI LOKESWARA RAO , Published at D.NO: 12-132, B.C. COLONY, VILLAGE PARAWADA, POST & MANDAL, ANAKAPALLI DIST, ANDHRA, ANDHRAPRADESH -531021. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, FLAT.NO: 504, BHARAT TOWERS, 5TH LANE, DWARAKA NAGAR, DISTRICT VISAKHAPATNAM, ANDHRAPRADESH-530018. Editor: CHIRIKI LOKESWARA RAO, (Responsible for selection of news under the PRB Act ) PRGI No: APTEL/2023/88653